



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 282 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 30 జూన్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## ఎయిరిండియా విమానంలో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రత... ఎమర్జెన్సీ ల్యాండింగ్

- టోక్యో నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య
- విమానం క్యాబిన్‌లో అకస్మాత్తుగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- ముందుజాగ్రత్త చర్యగా కోల్‌కతాకు విమానం మళ్లింపు



## టికెట్ రిజర్వేషన్ చార్ట్‌పై కీలక నిర్ణయం

- రైలు బయల్దేరడానికి 8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్ విడుదల
- వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు తగ్గనున్న అనిశ్చితి, ప్రయాణ ప్రణాళికకు వెసులుబాటు
- డిసెంబర్ 2025 నాటికి 10 రెట్లు శక్తివంతమైన కొత్త రిజర్వేషన్ సిస్టమ్



## యూరిక్ యాసిడ్ కారణంగా గుండెపోటు ముప్పు!

- గౌట్‌కే పరిమితం అనుకుంటున్న యూరిక్ యాసిడ్‌తో గుండెకు చేటు!
- ఆకస్మిక గుండెపోట్లు, మెటబాలిక్ సింగ్రోమ్‌తో సంబంధంపై కొత్త పరిశోధనలు
- రక్తంలో అధిక స్థాయిలు రక్తనాళాలను దెబ్బతీస్తాయని వెల్లడి
- ఆహారంతో పాటు డీహైడ్రేషన్, నిద్రలేమి కూడా ప్రధాన కారణాలు



# తప్పులు రిపీట్ చేయొద్దు!

**నెల రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు ఆదేశం**



- నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది!: సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ వార్షికోత్సవం సందర్భంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం
- మనం చేసిన మంచి పనులను వివరిస్తూనే, వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై సర్వేలు చేయిస్తున్నా.. బాగోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- తప్పులు పునరావృతం కావొద్దని, 2029 గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక ఉగ్రవాదులతో ప్రమాదమని తీవ్ర విమర్శలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా, నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పరిశీలకులతో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. గతంలో తాము చేసిన తప్పులు పునరావృతం కాకూడదని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి - మిగతా2లో



## ప్రపంచ సినిమాకు మరిన్ని సేవలు అందించాలి

- కమల్ హాసన్‌కు ఆస్కార్ అవార్డుల కమిటీలో సభ్యత్వం... పవన్ కల్యాణ్ స్పందన
- ఆస్కార్ 2025 కమిటీ సభ్యుడిగా కమల్ హాసన్
- కమల్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపిన పవన్
- ఇది భారత సినీ పరిశ్రమకు గర్వకారణమన్న ఏపీ డిప్యూటీ సీఎం
- కమల్ ఆరు దశాబ్దాల సినీ ప్రస్థానాన్ని కొనియాడిన పవన్
- రచయితగా, దర్శకుడిగా, నటుడిగా ఆయన ప్రతిభ అసాధారణం అని కితాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వనటుడు, పద్మభూషణ్ కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం దక్కడంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మక అకాడమీ అవార్డ్స్ (ఆస్కార్)-2025 కమిటీలో సభ్యుడిగా కమల్ హాసన్ ఎంపిక కావడం పట్ల ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇది భారత సినీ పరిశ్రమకే - మిగతా2లో



## అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..
- ఏపీ విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనం
- 'రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనడానికి ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ
- ఈసెట్ రిజల్ట్స్ వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ కౌన్సిలింగ్ ప్రారంభం కాలేదు



## రెండు మూడు నెలల్లో శివకుమార్ సీఎం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్ హైకమాండ్‌కు ఇక్కడి పరిస్థితి గురించి తెలుసు
- ఆయనకు అవకాశం ఇవ్వడానికి సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుంది



## 'ఉచిత ల్యాప్‌టాప్' పేరిట కొత్త మోసం.. జాగ్రత్త

- కేంద్రం హెచ్చరిక
- ప్రజలకు ఆశల్ని కల్పించేలా సైబర్ మాయా వలను విసిరి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు కొత్త పన్నాగాలు
- తాజాగా దేశంలో విద్యార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు మెసేజ్‌లు


## కార్యకర్తల కష్టం ఉంది.. వారికి అన్ని విధాల అండగా ఉండాలి



- మనం అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి
- 151 సీట్లు 11 అయ్యాయంటే వారి అహంకారమే కారణం
- పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం
- సీనియర్లు పార్టీకి కాపలా కాశారు.

**అమరావతి**

మంగళగిరిః "సుపరిపాలనలో– తొలి అడుగు" కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ఇంటింటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చించేందుకు మంగళగిరిలోని జాతీయ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి లోకేష్ ప్రసంగించారు. - మిగతా3లో



## మార్స్‌పై నీటి జాడలు!

- కీలక సమాచారం వెల్లడించిన నాసా క్యూరియాసిటీ రోవర్!
- మార్స్‌పై సైతం శాస్త్రవేత్తలో పరిశోధనలు చేపడుతున్న విషయం తెలిసిందే.
- నాసా క్యూరియాసిటీ రోవర్ తాజాగా మార్స్‌పై ఓ రహస్య ప్రాంతంలో తవ్వకాలు
- బృహస్పతి ఉపగ్రహమైన గానిమీడ్ భూగర్భంలో సముద్రం ఉండే అవకాశం ఉందని అంచనా

## కరేడు గ్రామ ప్రజలపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ**

**విజయవాడ**

నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో బలవంతపు సేకరణను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన కరేడు గ్రామ ప్రజలపై పోలీసుల నిర్బంధం, అరెస్టులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ నేడు ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం, కరేడు గ్రామంలో షిర్డిసాయి అనుబంధ ఇండోసోల్ కంపెనీకి 8458 ఎకరాల భూమిని అప్పనంగా అప్పగించేందుకు చేస్తున్న భూసేకరణకు వ్యతిరేకంగా, బలవంతపు సేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ భూ పోరాట సాధన కమిటీ ఆధ్వర్యాన శాంతియుతంగా ఆందోళన చేపట్టిన గ్రామ ప్రజలపై పోలీసులు అత్యంత నిర్బంధంగా వ్యవహరించి, అరెస్టులకు - మిగతా3లో





## 90 డిగ్రీల వంతెన.. ఏడుగురు ఇంజినీర్ల సస్పెన్షన్

- ఆ వంతెన 90 డిగ్రీల మలుపుతో నిర్మించడమే అందుకు కారణం
- దీనికి సంబంధించి మీడియాలో అనేక కథనాలు
- ఇలాంటి డిజైన్‌లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు

# తప్పులు రిపీట్ చేయొద్దు!

-మొదటిపేజీ తరువాయి

వస్తుంది... అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. "2014లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం. కానీ, వాటిని ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లలేకపోయాం, రాజకీయం మరిచిపోయాం. చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. వివేకానందరెడ్డి హత్యే దీనికి పెద్ద ఉదాహరణ. గుండెపోటు అని మొదట ప్రచారం చేసి, ఆ తర్వాత నాటకాలు ఆడి ప్రజల సానుభూతి పొందారు. కోడికత్తి డ్రామా, ఎన్నికల ముందు గులకరాయి డ్రామా వంటివి వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనం. ఇలాంటి దుష్ప్రచారాలను తేలిగ్గా తీసుకోవద్దు. మనం చేస్తున్న మంచిని ఎంత బలంగా వివరిస్తామో, వారి కుట్రలను కూడా అదే స్థాయిలో ప్రజలకు వివరించాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రజలకు అందుబాటులో ఉంటే ఆదరిస్తారు... లేకుంటే టాటా చెప్పేస్తారు**

ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండడం ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "పనిచేయడం ఒక ఎత్తయితే, జనానికి అందుబాటులో ఉండటం మరో ఎత్తు. ప్రజల్లోకి వెళ్లడానికి ఎలాంటి నామోషీ వద్దు. చేసిన పనులతో పాటు, చేయలేని పనులకు గల కారణాలను కూడా వివరించాలి. ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే, వారు అంతగా ఆదరిస్తారు. లేదంటే నిర్మొహమాటంగా టాటా చెప్పేస్తారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన పనితీరు ఉండాలి" అని సూచించారు.

**ప్రతి ఒక్క ఎమ్మెల్యేతో మాట్లాడతా... మంచి చెడులు వివిస్తా**

ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును తాను నిరంతరం గమనిస్తున్నానని, వివిధ మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు. "ప్రతి ఎమ్మెల్యేతో త్వరలోనే నేను స్వయంగా సమావేశమవుతాను. ఇప్పటికే నలుగురితో మాట్లాడాను. వారు చెప్పేది ఓపిగ్గా వింటాను. వారిలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవడానికి సమయం ఇస్తాను. మారితే సంతోషం, లేదంటే నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడను. వారసులైనా సరే, కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు ఉంటుంది. పని చేయకుండా పదవులు ఆశిస్తే కుదరదు, వారికో నమస్కారం పెట్టేస్తా" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

**ప్రజలకు జవాబుదారీగా ఉందాం... పొరపాట్లు ఉంటే సరి చేసుకుందాం**

పాలనలో ఏమైనా లోటుపాట్లు, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకు సాగుదామని చంద్రబాబు అన్నారు. "ప్రజలు మెచ్చాలి, కార్యకర్తలు ఆమోదించాలి. అదే మన లక్ష్యం. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలనుకోవడం బాధాకరం. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసినా 11 సీట్లకే పరిమితమయ్యారు. డబ్బు అన్నివేళలా పనిచేయదు. మనం ఆదర్శవంతమైన రాజకీయాలు చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ కొనసాగింపుతోనే అభివృద్ధి... కళ్ల ముందున్న వాస్తవమిది**

సుస్థిర ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చంద్రబాబు అన్నారు. "2004, 2019లో టీడీపీ ఓడిపోవడం వల్ల రాష్ట్రం తిరోగమనం పట్టింది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు నమ్మకంతో ముందుకొస్తున్నారు. ఏడాదిలోనే రూ.9.34 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని తెలిపారు. పోలవరం, అమరావతి పనులు వేగవంతం చేశామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నామని వివరించారు.

**కార్యకర్తలను మరువొద్దు**

సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ తమ ప్రభుత్వం ముందుందని చంద్రబాబు పేర్కొన్నారు. "64 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్నా క్యాంటీన్లు వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. విధానాలు ఎంత బాగున్నా, వాటి అమలులో లోపాలుంటే ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో బాధ్యతగా పనిచేయాలి. 2029లో గెలుపే నా ప్రణాళిక. అందుకోసం కష్టపడి పనిచేయడం కాదు, స్మార్ట్‌గా పనిచేయాలి" అని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగు వేసుకున్న ఆర్థిక ఉగ్రవాదులు, రౌడీలతో రాష్ట్రానికి ప్రమాదమని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# కార్యకర్తల కష్టం ఉంది, వారికి అన్ని విధాల అండగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో మనం ఊహించని విధంగా 94 శాతం సీట్లను ప్రజలు గెలిపించారు. దీనికి ప్రధాన కారణం గత పాలకులకు ఉన్న అహంకారం, వారి పని విధానం. అందుకే మనల్ని పెద్దఎత్తున ఆశీర్వదిం చారు, దీవించారు, గెలిపించారు. ఈ గెలుపు వెనుక కార్యకర్తల కష్టం చాలా ఉంది. నేను యువగళం పాదయాత్ర ప్రారభించినప్పుడు %జఖదీ%– కబ్ సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మన నాయకుడు చంద్రబాబు చెప్పారు. ఇప్పటికే గ్రామ పార్టీ ఉందని, ఫలితం ఉండదని నేను చెప్పాను. చేసి చూపిస్తామని, దాని వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో కూడా చూస్తారని ఆనాడు చెప్పడం జరిగింది. క్లస్టర్, యూనిట్, బూత్ వ్యవస్థ వచ్చిన తర్వాతే మన బూత్ లు పటిష్టం అయ్యాయి. అనేక కార్యక్రమాలు మన చేయగలుగుతున్నాం. దీనిని మనం గుర్తు పెట్టుకోవాలి.

**151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారం**

గడిచిన ఐదేళ్లలో ఇక్కడ ఉన్న నేతలందరిపైనా అప్పటి పాలకపక్షం కేసులు పెట్టింది. శనివారం వస్తే ఎవరి గోడ పగలకొడతారో, ఎవరి ఇల్లు కూల్చుతారో, ఎవరిని జైలుకు తీసుకెళతారో తెలియని పరిస్థితి. ఇవాళ సెల్యూట్ కొట్టే పోలీసులే మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు పెట్టారు. ఇబ్బంది పెట్టారు. మన దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడిచేస్తే పట్టించుకోని పరిస్థితి. మనం అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి. సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలి. మొన్న ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లినప్పుడు పొగాకు రైతుల సమస్య ఉందని తెలుసుకున్నా. వెంటనే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో పాటు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాం. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవాలి. వాటిని పరిష్కరించేందుకు కష్టపడాలి. ఈ రోజు నేను ఒక్క పెట్టుబడి తీసుకువచ్చేందుకే అహర్నిశలు కష్టపడుతున్నా. మన నియోజకవర్గ పనికోసం ఇంకెంత కష్టపడాలి? మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. 151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి.

పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం

సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూడా తల్లికి వందనం అమలు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం. ఆర్థిక వనరులు సమకూర్చుకుని, అహర్నిశలు కష్టపడి అద్భుతమైన కార్యక్రమాలు చేస్తున్నాం. అన్నీ చేశామని చెప్పడం లేదు. ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలి. పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

కష్టపడిన కార్యకర్తలను మరువద్దని మిమ్మల్నందరినీ కోరుతున్నా

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, సంస్థాగత నిర్మాణంపై చర్చించేందుకు ఇక్కడ సమావేశమయ్యాం. 164 మంది ఎమ్మెల్యేల్లో 88 మంది మొదటిసారి గెలిచినవారు ఉన్నారు. మంత్రివర్గంలో ఉన్న 25 మందిలో 17 మంది మొదటిసారి గెలిచినవారు ఉన్నారు. ఇక్కడ ఉన్న వారిలో చాలా మంది ప్రతిపక్షంలో ఉండగా వేధింపులకు గురైనవారు ఉన్నారు. జైలుకు వెళ్లిన వారు ఉన్నారు. అక్రమ కేసులు నమోదైన వారు ఉన్నారు. కష్టపడిన కార్యకర్తలను మరువద్దని మిమ్మల్నందరినీ కోరుతున్నా. వారిని విస్మరించకుండా ఉండేందుకే పరిశీలకులను వేయడం జరిగింది. మంగళగిరి నియోజకవర్గంలో నియమించిన పరిశీలకుడిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నా.

**ప్రపంచం మొత్తం తిరిగినా వచ్చేది పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికే**

పార్టీనే సుప్రీం. దేశం మొత్తం తిరిగినా, ప్రపంచం మొత్తం తిరిగినా తిరిగి వచ్చేది పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికే. అందుకే ప్రతి జిల్లాలో, నియోజకవర్గంలో పార్టీ కార్యాలయం నిర్మించాలని చెప్పడం జరిగింది. దేశ స్థాయిలో బీజేపీకి తప్ప ఇంత పెద్ద కార్యాలయం మరే పార్టీకి లేదు. ఒక వ్యవస్థ మనం. ఎవరూ శాశ్వతం కాదు. మనం ఎక్కడ కూర్చోవాలే ప్రజలే నిర్ణయిస్తారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకోవాలి. ఇది చంద్రబాబు గారి ఆదేశాలు. ఏడాది హనీమూన్ అయిపోయింది.

**పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తాం**

మహిళలను ప్రోత్సహించేందుకు కప్స్ లో కో కన్వీనర్ పదవి తీసుకువచ్చాం. పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తాం. కమిటీలు వేసేముందు స్థానిక నాయకత్వంతో మాట్లాడాలి. కేవస్ఎస్ లు 90 శాతం పూర్తి చేశాం. బూత్ లు 82, యూనిట్ లు 80 శాతం, క్లస్టర్ 80శాతం పూర్తి చేయడం జరిగింది. అనుబంధ విభాగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఆయా కమిటీల్లో పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. జులై 5 నాటికి కమిటీలన్నింటిని పూర్తి చేయాలి. పరిశీలకులకు కూడా బాధ్యత ఉంది. కుప్పంలో సంస్థాగత నిర్మాణం వల్లే చంద్రబాబు గారు వరుసగా విజయం సాధిస్తున్నారు. కచ్చితంగా పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలి. క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

**సీనియర్లకు ఉన్న అనుభవం, యువతకు ఉన్న శక్తి రెండింటినీ జోడించాల్సిన అవసరం ఉంది**

సీనియర్లకు ఉన్న అనుభవం, యువతకు ఉన్న శక్తి రెండింటినీ జోడించాల్సిన అవసరం ఉంది. సీనియర్లే పార్టీకి కాపలా కాశారు. వారే పార్టీకి అండగా నిలబడ్డారు. నాలుగు దశాబ్దాలు పార్టీని ముందుకు తీసుకెళ్లారు. దీనిని మనం మర్చిపోకూడదు. పార్టీ పదవుల విషయంలో దామాషా ప్రకారం పదవులు ఇవ్వాలి. అందరినీ కలుపుకుని పోవాలి. నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణం బాగా చేసిన వారిలో మంత్రి నిమ్మల రామానాయుడు గారు నెం.1గా ఉన్నారు. మంగళగిరి ఐదో స్థానంలో ఉంది. మనలో పోటీతత్వం రావాలి. బాగా కష్టపడాలి. బాగా పనిచేసిన కార్యకర్తలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించాలి. నా నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా బాగా పనిచేసిన కార్యకర్తలను సత్కరించడం జరుగుతోంది.

**సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలి**

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలి. కుటుంబ సాధికార సారథి నుంచి పొలిట్ బ్యూరో సభ్యుల వరకు అందరం రోడ్డెక్కాలి. అందరం పాల్గొనాలి. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి. డోర్ టూ డోర్ వెళ్లినప్పుడు ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ ను యాప్ లో నమోదు చేయాలి. మై టీడీపీ యాప్ ద్వారా మీరు చేసిన పనులు పార్టీకి తెలియజేయాలి. నెల రోజుల పాటు తూచా తప్పకుండా అందరం డోర్ టూ డోర్ ప్రచారం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మంత్రులు అచ్చం నాయుడు పయ్యావుల కేశవ్ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హోం మంత్రి అనిత పార్టీ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాగంట శ్రీనివాసులు రెడ్డి కొల్లు రవీందర్ సవితమ్మ రాంప్రసాద్ రెడ్డి విప్ కాలువ శ్రీనివాసులు పార్లమెంట్ సభ్యులు పార్థసారథి చిన్నరాజప్ప పార్టీ అధ్యక్షుడు పళ్ళ దేవినేని ఉమా మంత్రి శ్రీనివాస్ బైరెడ్డి శబరి ఇతర ప్రజాప్రతినిధులు శాసనసభ్యులు నామినేటెడ్ చైర్మన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు వారందరికీ సీఎం చంద్రబాబు నాయుడు నారా లోకేష్ పలు సూచనలు చేశారు

లిలిలి

## కరేడు గ్రామ ప్రజలపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం.

-మొదటిపేజీ తరువాయి

గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ నిర్బంధకాండ కొనసాగించటం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల్ని ప్రయోగించి రైతులు, గిరిజనులు, మహిళలను అక్రమంగా అరెస్టులకు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కరేడు గ్రామ ప్రజల ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ఏఐసిసి సభ్యురాలు సుంకర పద్మశ్రీ పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.ఇండోసోల్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని, ప్రజలపై నిర్బంధ కాండను ప్రయోగించిన పోలీసులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

## అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు: వైఎస్ జగన్

**తాడేపల్లి:** ఏపీ ఈసెట్ రిజల్ట్స్ వచ్చి 45 రోజులవుతున్నా ఇంకా కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. చంద్రబాబు సర్కారును నిలదీశారు ఇది ఏపీ విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనమంటూ వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు వైఎస్ జగన్. 'రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనడానికి ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ. ఈసెట్ రిజల్ట్స్ వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ కౌన్సిలింగ్ ప్రారంభం కాలేదు. మరోవైపు రేపటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభం అవుతున్నాయి. ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో అడ్మిషన్లకోసం 34వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షలు రాస్తే అందులో 31,922 మంది ఉత్తీర్ణత సాధించారు. గతనెల మే 15న ఫలితాలు వెలువడినా, ఇప్పటికీ కౌన్సెలింగ్ ప్రక్రియపై షెడ్యూల్ విడుదలచేయకపోవడం, ఆ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం, విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనం. అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు' అంటూ విమర్శించారు.

## వదిలేది లేదంటున్న చెల్లెమ్మ...

**ఏలూరు :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తనకు తాను ఏమనుకుంటుందో తెలియదు. వైఎస్ లెగసీ తనకే ఉందన్న భ్రమలో ఆమె ఉన్నట్లు కనపడుతుంది. అన్నపై పోరాటం చేయవచ్చు. ఇరువురి పార్టీలు వేరు కాబట్టి ఎవరూ వ్యతిరేకించరు. కానీ అదే పనిగా అధికార పార్టీ కంటే ఎక్కువగా సోదరుడిపైనా, ఆ పార్టీ పైన విమర్శలు చేస్తుండటం చూస్తే వైఎస్ షర్మిలలో ఫ్రస్టేషన్ పీక్స్ కు చేరకున్నట్లు కనిపిస్తుంది. ఏ చిన్న అవకాశాన్ని కూడా షర్మిల వదిలిపెట్టడం లేదు. బహుశ అధికార పార్టీ కంటే ఎక్కువగానే విమర్శలు చేస్తుండటం కొంత ఏవగింపుగా మారింది. కేవలం వైసీపీ అభిమానులకు మాత్రమే కాదు. కాంగ్రెస్ పార్టీలోని నేతలు, వైఎస్ తో సంబంధమున్న ముఖ్యమైన సీనియర్ నేతలు సయితం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.. ప్రజాసమస్యలపై పోరాటం చేసి ప్రజల్లోకి వెళ్లాలి. సోదరుడిని ఓడించాలంటే ఇది మార్గం కాదని వైఎస్ షర్మిలకు సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఎవరు చెప్పినా ఆమె ఏకైక లక్ష్యం. జగన్ తిరిగి ముఖ్యమంత్రి కాకూడదనేలా అనిపిస్తుందని వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలోని కొందరు చేస్తున్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆస్తుల వివాదాలే ఈ కక్ష్య లకు కారణం కావచ్చు. ఆస్తి పంచి ఇవ్వకపోవడం జగన్ తప్పు కావచ్చు. అయితే అది కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి, సన్నిహితులు, బంధువుల మధ్య రాజీ కుదుర్చుకోవాల్సిన అన్నా చెల్లెళ్లు ఇద్దరూ ఆగర్భ శత్రువులుగా మారారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## ఎయిరిండియా విమానంలో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రత... ఎమర్జెన్సీ ల్యాండింగ్

ఎయిరిండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. జపాన్ రాజధాని టోక్యోలోని హనేడా విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వస్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో దానిని అత్యవసరంగా కోల్‌కతాకు మళ్లించారు. ప్రయాణికులు, సిబ్బందితో సహా విమానం సురక్షితంగా ల్యాండ్ అవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, %ఖా×%357 విమానం టోక్యో నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో క్యాబిన్‌లో ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పెరిగాయి. ఈ విషయాన్ని గమనించిన విమాన సిబ్బంది, పైలట్లను అప్రమత్తం చేశారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా, పైలట్లు ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని సమీపంలోని కోల్‌కతా విమానాశ్రయానికి మళ్లించాలని నిర్ణయించారు. దీనితో విమానాన్ని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. "విమానం కోల్‌కతాలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రస్తుతం విమానానికి సాంకేతిక నిపుణులతో తనిఖీలు నిర్వహిస్తున్నాం" అని తెలిపింది. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కోల్‌కతాలోని తమ గ్రౌండ్ సిబ్బంది అన్ని విధాలా సహాయం అందిస్తున్నారని ఎయిర్‌లైన్స్ పేర్కొంది. వారిని వీలైనంత త్వరగా ఢిల్లీలోని తమ గమ్యస్థానానికి చేర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించింది.

## టికెట్ రిజర్వేషన్ చార్ట్‌పై కీలక నిర్ణయం

రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శాఖ ఒక ముఖ్యమైన శుభవార్త అందించింది. ఇకపై రైలు బయల్దేరడానికి 8 గంటల ముందే తుది రిజర్వేషన్ చార్ట్‌ను సిద్ధం చేయనున్నట్లు ఆదివారం ప్రకటించింది. ప్రస్తుతం ఈ చార్ట్‌ను రైలు బయల్దేరడానికి 4 గంటల ముందు మాత్రమే విడుదల చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయంతో ప్రయాణికులకు, ముఖ్యంగా వెయిటింగ్ లిస్ట్ టికెట్లు ఉన్నవారికి ఊరట లభించనుంది. టికెట్ బుకింగ్ వ్యవస్థలో చేపడుతున్న సంస్కరణల పురోగతిని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టికెటింగ్ ప్రక్రియ మొత్తం స్మార్ట్‌గా, పారదర్శకంగా ఉండాలని, ప్రయాణికుల సౌకర్యానికే పెద్దపీట వేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష అనంతరం, రిజర్వేషన్ చార్ట్ తయారీ సమయాన్ని మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మార్పును ఎలాంటి అంతరాయాలు లేకుండా దశలవారీగా అమలు చేయనున్నారు.

**వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు ఊరట**

కపై రిజర్వేషన్ చార్ట్‌ను రైలు బయల్దేరడానికి 8 గంటల ముందే సిద్ధం చేస్తారు. దీనివల్ల ప్రయాణికులు తమ టికెట్ స్టేటస్‌ను ముందుగానే చూసుకునేందుకు వీలు కలుగుతుంది. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చేవారికి ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. టికెట్ కన్ఫర్మ్ కాకపోతే, ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడానికి వారికి తగినంత సమయం దొరుకుతుంది. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికుల అనిశ్చితికి తెరదించుతూ, వారి ప్రయాణ ప్రణాళికలను మరింత సులభతరం చేయడమే ఈ మార్పు ముఖ్య ఉద్దేశం.

**డిసెంబర్ 2025 నాటికి కొత్త రిజర్వేషన్ వ్యవస్థ**

దీంతో పాటు, భారతీయ రైల్వే తన ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్)ను భారీగా అప్‌గ్రేడ్ చేసే పనిలో ఉంది. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (%జ=×ూ%) అభివృద్ధి చేస్తున్న ఈ కొత్త వ్యవస్థ, ప్రస్తుత వ్యవస్థ కంటే పది రెట్లు అధిక లోడ్‌ను నిర్వహించగలదు. 2025 డిసెంబర్ నాటికి ఈ అప్‌గ్రేడ్ పూర్తి కావచ్చని అంచనా. ఈ కొత్త వ్యవస్థ అందుబాటులోకి వస్తే, నిమిషానికి 1.5 లక్షలకు పైగా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అలాగే, నిమిషానికి 40 లక్షల కంటే ఎక్కువ టికెట్ ఎంక్వైరీలను ఇది నిర్వహించగలదు.

**తత్కాల్ బుకింగ్‌కు ఓటీపీ తప్పనిసరి**

కొత్త పీఆర్ఎస్ వ్యవస్థలో ప్రయాణికుల సౌలభ్యం కోసం బహుభాషా సపోర్ట్, సులభమైన ఇంటర్‌ఫేస్, ఛార్జీల క్యాలెండర్, సీట్ల ఎంపికలో ప్రాధాన్యత వంటి అధునాతన ఫీచర్లను కూడా తీసుకురానున్నారు. దివ్యాంగులు, విద్యార్థులు, రోగులకు అవసరమైన సపోర్ట్‌ను కూడా ఇందులో ఇంటిగ్రేట్ చేయనున్నారు. మరోవైపు, జూలై 1 నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే తప్పనిసరిగా ధృవీకరించిన యూజర్లు మాత్రమే అనుమతించబడతారు. జూలై నెలాఖరు నాటికి, తత్కాల్ బుకింగ్‌ల కోసం ఆధార్ లేదా డిజిలాకర్‌తో అనుసంధానమైన ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుల ద్వారా ఓటీపీ ఆధారిత ధృవీకరణను తప్పనిసరి చేయనున్నారు.

## యూరిక్ యాసిడ్ కారణంగా గుండెపోటు ముప్పు!

యూరిక్ యాసిడ్ పేరు వినగానే చాలామందికి కీళ్ల నొప్పులు, ముఖ్యంగా గౌట్ సమస్యే గుర్తుకొస్తుంది. కానీ, ఇటీవలి పరిశోధనలు దీనికి సంబంధించి ఓ కొత్త, మరింత తీవ్రమైన కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. యూరిక్ యాసిడ్ కేవలం కీళ్లకే పరిమితం కాదని, అది మన గుండె ఆరోగ్యానికి, జీవక్రియలకు సంబంధించిన లోతైన సమస్యలకు ఒక నిశ్శబ్ద హెచ్చరిక అని నిపుణులు చెబుతున్నారు. ఆకస్మిక గుండెపోట్లు, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల వెనుక యూరిక్ యాసిడ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

**గుండెపై యూరిక్ యాసిడ్ ప్రభావం ఎలా ఉంటుంది?**

శరీరంలో ప్యూరిన్ల జీవక్రియ తర్వాత మిగిలిపోయే వ్యర్థ పదార్థమే యూరిక్ యాసిడ్ అని, మూత్రపిండాలు దానిని బయటకు పంపేస్తాయని మనకు తెలుసు. కానీ, దీని స్థాయిలు పెరిగినప్పుడు (హైపర్‌యూరిసెమియా), అది శరీరంలో ఒక ఇన్ఫ్లమేటరీ రసాయనంలా ప్రవర్తించడం మొదలుపెడుతుంది. అధిక యూరిక్ యాసిడ్ రక్తనాళాలలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ప్రేరేపిస్తుందని పరిశోధకులు గమనించారు. ఈ కారణంగా రక్తనాళాల లోపలి పొర (ఎండోథీలియం) దెబ్బతింటుంది. ఈ నష్టం ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించకుండానే నిశ్శబ్దంగా జరిగిపోతూ, గుండె జబ్బులకు పునాది వేస్తుంది. అంటే, ఇది కేవలం కీళ్ల నొప్పులకే కాదు, మన గుండెను కూడా బలహీనపరుస్తుందని స్పష్టమవుతోంది. సాధారణంగా కొలెస్ట్రాల్, రక్తనాళాల్లో అడ్డంకుల వల్లే గుండెపోటు వస్తుందని భావిస్తారు. అయితే, కొలెస్ట్రాల్ స్థాయిలు సాధారణంగా ఉన్నప్పటికీ, యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్నవారిలో ఆకస్మిక గుండెపోటు ప్రమాదం గణనీయంగా పెరుగుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. యూరిక్ యాసిడ్ మైక్రోవాస్కులర్ వ్యాధికి, అంటే చిన్న రక్తనాళాలు గట్టిపడటానికి లేదా సన్నబడటానికి కారణమవుతుంది. ఈ చిన్న అడ్డంకులు సాధారణ స్కానింగ్‌లలో కనిపించకపోవచ్చు, కానీ ఇవి గుండెకు ఆక్సిజన్ సరఫరాను అడ్డుకుని, ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండానే గుండెపోటుకు దారితీస్తాయి.

**మెటబాలిక్ సిండ్రోమ్‌కు సూత్రధారి యూరిక్ యాసిడ్?**

అధిక రక్తపోటు, పొట్ట చుట్టూ కొవ్వు, అధిక బ్లడ్ షుగర్ వంటి సమస్యల సమాహారమే మెటబాలిక్ సిండ్రోమ్. ఇన్నాళ్లూ ఈ సమస్యలో యూరిక్ యాసిడ్‌ను ఒక సహాయక పాత్రధారిగానే చూశారు. కానీ, ఇప్పుడు నిపుణులు దీనిని ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్నారు. కొలరాడో విశ్వవిద్యాలయానికి చెందిన మూత్రపిండ వ్యాధుల పరిశోధకుడు డాక్టర్ రిచర్డ్ జాన్సన్ ప్రకారం, యూరిక్ యాసిడ్ ఇన్సులిన్ నిరోధకతను (ఇన్సులిన్ రెసిస్టెన్స్) ప్రేరేపిస్తుందని, ఇది మెటబాలిక్ సిండ్రోమ్ అభివృద్ధిలో కీలకమైన దశ అని సూచించారు. అంటే, రక్తంలో చక్కెర పెరగడానికి లేదా బరువు పెరగడానికి ముందే, యూరిక్ యాసిడ్ మన జీవక్రియలను దెబ్బతీయడం ప్రారంభిస్తుందని అర్థం చేసుకోవచ్చు.

## ప్రపంచ సినిమాకు మరిన్ని సేవలు అందించాలి

-మొదటిపేజీ తరువాయి

గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, కమల్ హాసన్ బహుముఖ ప్రజ్ఞను, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఆరు దశాబ్దాలకు పైబడిన అద్భుతమైన నట జీవితంతో, కమల్ హాసన్ గారు ఒక నటుడిగా కంటే ఎంతో ఎక్కువ. నటుడిగా, కథకుడిగా, దర్శకుడిగా ఆయన సినిమాపై చూపిన ప్రభావం భారతీయ చిత్ర పరిశ్రమపైనే కాకుండా ప్రపంచ సినిమాపైనా చెరగని ముద్ర వేసింది" అని పవన్ కల్యాణ్ వివరించారు. సినిమా నిర్మాణంలోని ప్రతి అంశంలోనూ కమల్ హాసన్‌కు ఉన్న పట్టు ప్రశంసనీయమని పవన్ పేర్కొన్నారు."రచయితగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, నటుడిగా సినిమాలోని అన్ని విభాగాలపై ఆయనకు ఉన్న పట్టు నిజంగా స్ఫూర్తిదాయకం. ఆయన ఆ రంగంలో ఒక నిజమైన మాస్టర్" అని తన సందేశంలో తెలిపారు. కమల్ హాసన్ ప్రపంచ సినిమాకు మరిన్ని సంవత్సరాలు సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. కమల్ హాసన్‌కు దక్కిన ఈ గౌరవంతో భారతీయ సినిమా ఖ్యాతి మరింత పెరిగిందని పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ


సోమవారం 30 జూన్ 2025




www.viswamvoice.com

# ప్రజలతో తెలుగు దేశం పార్టీ నేతలు మమేకం కావాలి

- పార్టీ కార్యకర్తలకు ఇకపై ప్రత్యేక సముచిత స్థానం
- జులై 5 నాటికి పార్టీ కమిటీల నియామకం పూర్తి
- మనం చేసిన పనులను ప్రజలకు చెప్పుకోలేకే ఓడిపోయాం
- జులై 2 న "ఇంటింటికీ తెలుగుదేశం" సన్నద్ధంలో చంద్రబాబు
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే నోట చంద్రబాబు మాటలు





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలతో తెలుగు దేశం పార్టీ నేతలు ఇకపై మరింత మమేకం కావాలి... పార్టీ కార్యకర్తలకు పార్టీ కార్యక్రమాలు, పదవుల్లో ఇకపై ప్రత్యేకమైన సముచిత స్థానం కల్పిస్తాం... జులై 5 తేదీ నాటికి పార్టీ కమిటీల నియామకాలను పూర్తి చేస్తాం... మనం గతంలో పనులు చేయక ఓడిపోలేదు, మనం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల పనుల మేలును మనం ప్రజలకు సమర్ధవంతంగా చెప్పుకోలేకే ఓడిపోయాం... ఈ ఏడాది టాప్ న్.డి.ఏ. పాలనలో చేసిన మంచిని ఇప్పుడు "ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ" కార్యక్రమంలో ప్రజలకు వివరిద్దాం... అని పలు విషయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్టు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా "సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ" పేరుతో మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్?ఛార్జులతో పాటు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కూడా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ పార్టీ నేతలకు వివిధ విషయాలపై దిశానిర్దేశం చేసిన పలు అంశాలను ఎమ్మెల్యే ఓ ప్రకటనలో స్థానిక మీడియాకు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జులై 2 నుంచి సుపరిపాలనలో తొలి అడుగు పేరిట నిర్వహించనున్న ఇంటింటి ప్రచారం పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్మాణంలపై ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నేతలకు వివరించారు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించ వలసిన ప్రచారం, నిరంతరం ప్రజా సమస్యలను స్వీకరించడం, పరిష్కరించడం, ప్రతిపక్ష పార్టీల ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం వంటి అంశాలపై పార్టీ నేతలకు పలు సలహాలు, సూచనలను ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పరచు కోవాలనీ, వారితో మమేకం కావాలనీ, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని చెప్పారు. "మనం గతంలో పనులు చేయక ఓడిపోలేదు, మనం చేసిన పనులను ప్రజలకు చెప్పుకోలేక పోవడం వల్లే ఓడిపోయాము. ఇప్పుడు మనం ప్రజల మధ్యకు వెళ్ళి, మన పనులను వివరించాలి" అని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. అమరావతిని ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు, "స్వర్ణ ఆంధ్ర ఏ 2047" దీర్ఘకాలిక లక్ష్యంలో భాగంగా 2050 నాటికి అమరావతి 35 లక్షల జనాభాతో, 15 లక్షల ఉద్యోగాలను సృష్టించే కేంద్రంగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేసి, పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర జీవనాడిగా చెబుతూ.. దాన్ని పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చంద్రబాబు తెలిపారు అన్నారు. పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామనీ, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు తన ప్రసంగంలో హామీ ఇచ్చారు.

**మనం ఆ తప్పు చేయకూడదు: మంత్రి నారా లోకేశ్**

అధికారంలో ఉన్నప్పటికీ ప్రతిపక్షంలా పని చేయాలని పార్టీ శ్రేణులకు లోకేష్ పిలుపు నిర్వహించారు. వైసీపీలా అహంకారానికి పోవద్దని కార్యకర్తలకు గట్టి హెచ్చరించారు. అధికారం చేతికి వచ్చిందన్న అలసత్వం ప్రదర్శించవద్దని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ పతనాన్ని ఉదాహరణగా చూపుతూ, అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన గట్టిగా హెచ్చరించారని సత్యప్రభ వెల్లడించారు. "151 సీట్లు గెలిచిన పార్టీ కేవలం 11 స్థానాలకే పరిమితమైందంటే దానికి వారి అహంకారమే ప్రధాన కారణం. మనం ఆ తప్పు చేయకూడదు. అధికారంలో ఉన్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉన్నట్లే ప్రజలతో మమేకమవ్వాలి. వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు అన్నారు. ఎన్నికల్లో చారిత్రక విజయం వెనుక కార్యకర్తల అలుపెరగని శ్రమ ఉందని, కష్టపడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దని నేతలకు సూచించారు. జులై 5వ తేదీ నాటికి పార్టీ కమిటీల నియామకాలన్నీ పూర్తి చేయాలని గడువు విధించారు. పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పార్టీ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయాలని నొక్కిచెప్పారు. పార్టీని నాలుగు దశాబ్దాలుగా ముందుకు నడిపిన సీనియర్ల అనుభవాన్ని, యువత ఉత్సాహాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. "ప్రపంచమంతా తిరిగినా మనం తిరిగి వచ్చేది పవిత్ర దేవాలయం లాంటి పార్టీ కార్యాలయానికే. గత పాలనలో అలాంటి కార్యాలయంపై దాడి జరిగినా పట్టించుకోని దుస్థితి చూశాం" అని లోకేష్ గుర్తుచేశారు అన్నారు. పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును సీరియస్‌గా తీసుకుని విజయవంతం చేయాలని, ఎక్కడ కూర్చోవాలో నిర్ణయించేది ప్రజలేనని ఆయన కార్యకర్తలకు ఉద్బోధించారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెల్లడించారు.

## ఆకుమర్తి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆత్మీయ సమావేశం

**జూలై 7 ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ వేడుకు**



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గం ఎంఆర్పిఎస్ ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గం అధ్యక్షులు ఆకుమర్తి రమేష్ మాదిగ అధ్యక్షతన పేరూరు లో జరిగింది ఈ కార్యక్రమంలో ఆకుమర్తి రమేష్ మాట్లాడుతూ జూలై 7వ తారీఖున మాన్యశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నగారి పుట్టినరోజు వేడుకలు మరియు యమ్ ఆర్ పి యస్ 31వ ఆవిర్భావ వేడుకలు గ్రామ గ్రామాన జరుపుకుని ఉదయం 11గం లోకి జిల్లా హెడ్ క్వార్టర్ గడియార స్తంభం సెంటర్లో వేలాది గా కార్యకర్తలు తరలివచ్చి కేక్ కటింగ్ చేసి పలువురు సీనియర్ నాయకులు ను సన్మానించుకుని అన్నదానం రక్తదానం చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేయాలని అందుకు పెద్దలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గం లో ఉన్న నలుగురు మండల యమ్ ఆర్ పి యస్ అధ్యక్షులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్ అమలాపురం రూరల్ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చుట్టు గుళ్ళ సత్తిబాబు ఉప్పలగుప్తం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అమలాపురం టౌన్ యమ్ ఆర్ పి యస్ అద్యక్షుడు గంపల విజయ్ అల్లవరం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ రామక్రిష్ణ అల్లవరం మండలం ఎమ్మార్పీఎస్ యువసేన అద్యక్షుడు నామాడి నాగరాజు దండోరా సీనియర్ నాయకులు చుట్టుగుళ్ళ నీలకంఠం నేదునూరి నధానియేలు గన్నవరం నియోజకవర్గం యమ్ ఎస్ పి అధ్యక్షులు కొల్లు శ్రీను ఆకుమర్తి దుర్గారావు చేట్ల సత్యనారాయణ ఆకుమర్తి అమ్రుతరావు నవ్వుంద్రు నాగరాజు తొత్తరమూడి సాయి పెదపూడి భద్రం తొత్తరమూడి దుర్గారావు వివిధ మండల గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు

## మంచినీటి కుళాయిలో మురికి నీరు సరఫరా



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలంలోని కోరంగి గ్రామపంచాయతీ రక్షిత మంచినీటి పథకం ద్వారా అందిస్తున్న కుళాయి నీరు మురికిగా ఉన్నాయని అలాంటి కులాయి ద్వారా సరఫరా అయిన మురికి నీటిని త్రాగడం ఎలా అని బొడ్డు వెంకటాయ పాలెం గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని మార్కెట్ వద్ద విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్య గురించి వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటిని మంచిగా ఫిల్టర్ చేసి గ్రామానికి సరఫరా చేయాలని కోరారు.

## లయన్స్ క్లబ్ 912వ రోజు ఆ భాగ్యలకు అన్నదానం



**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని తాళ్ళరేవు లయన్స్ క్లబ్ ద్వారా అభాగ్యులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఆదివారం నాటికి ఈ కార్యక్రమం ప్రారంభించి 912 రోజులవుతుందని తెలిపారు.ఎన్నో రోజులుగా ఈ కార్యక్రమం దాతల సహకారంతో మరియు లయన్స్ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ బిల్లకుర్తి శ్రీనివాస రెడ్డి అన్నారు.

## అల్పపీడనం వాతావరణంతో రైతుల్లో ఆందోళన



**కాకినాడ జిల్లా, తాళ్ళరేవు, విశ్వం వాయిస్:** కాకినాడ జిల్లాలో గత వారం రోజుల నుండి అల్పపీడనాలు తుఫాను హెచ్చరికల వాతావరణంతో వారం రోజులుగా కొద్దిపాటి వర్షాలు, రాత్రి సమయంలో విపరీతమైన గాలులతో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో నారుమడులకు సిద్ధమవుతున్న రైతులు కొందరు విత్తనాలు వెదజల్లే సమయంలో వర్షపాతం వల్ల విత్తనాలు మొలకెత్తడానికి అవకాశాలు తక్కువ ఉన్నాయన్న ఆలోచనలో రైతులు వర్షం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. కాలాల మార్పులు వాతావరణ ఇబ్బందుల వల్ల ప్రతిసారి రైతులకు ఎదురు దెబ్బ తగులుతూనే ఉంది. ఈ క్రమంలో కొందరు రైతులు మాట్లాడుతూ విపత్తుల సమయంలో రైతులకు వర్షాల వల్ల తుఫాన్ వల్ల నష్టం సంభవించినప్పుడు ప్రభుత్వం స్పందించి రైతులకు ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఘనంగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌కి పౌర సన్మాన మహోత్సవం





**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు మరియు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్య విద్యాసంస్థల అధ్యక్షుడు నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన, ఇటీవల శాసనమండలి సభ్యులుగా విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖర్ కి ఘనమైన పౌరసన్మాన మహోత్సవం ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణం, శ్రీనగర్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు, విద్యా సంఘాల నాయకులు, రాజకీయ నేతలు రాజశేఖర్ నిబద్ధత, నిజాయితీ, ప్రజల పట్ల ఉన్న కమిట్మెంట్ను ప్రశంసిస్తూ, ఆయనను ప్రజాజీవితంలో ఆదర్శంగా కొనియాడారు. సభాధ్యక్షులుగా మాట్లాడిన నల్లమిల్లి శేషారెడ్డి , "ఎమ్మెల్సీ రాజశేఖర్ అంకితభావం, విశ్వసనీయతే ఆయన్ను విజయపథంలోకి నడిపించాయి. ఇది ప్రతి విద్యావేత్తకు గర్వకారణం," అని పేర్కొన్నారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ, "నిజాయితీతో నిండి ఉన్న నాయకులకు ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. రాజశేఖర్ విజయం నిబద్ధతకి నిదర్శనం" అన్నారు. బిజెపి కాకినాడ అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, "రాజశేఖర్ లో ఉన్న సమగ్రత, సమర్థత వలనే విజయం సాధ్యమైంది," అని కొనియాడారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ ఎన్. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, "నైతిక విలువలతో కూడిన రాజకీయ జీవితం ఎప్పుడూ ప్రజల మదిలో నిలుస్తుంది. రాజశేఖర్ ఆ మార్గంలో సాగుతున్నారు" అన్నారు. ఆదిత్య డిగ్రీ %ఴ% పీజీ కళాశాల డైరెక్టర్ ఎన్. సుగుణ రెడ్డి మాట్లాడుతూ, "రాజశేఖర్ సమన్యాయంగా అందరితో ముందుకెళ్లాలనే తపన కలిగి ఉండటమే ఆయన ప్రజాదరణకు కారణం" అని అభినందించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యంగా... చెవ్వూరి రవి (కాకినాడ మండలం విద్యాశాఖాధికారి), హబీబ్ భాషా (డిగ్రీ %ఴ% పీజీ కాలేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు), మతుకమల్లి శ్రీవిజయ్ (స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు), ఘంటసాల బ్రహ్మాజీ (ఎఫిలియేటెడ్ ప్రైవేట్ మేనేజ్మెంట్ కాలేజీల అధ్యక్షుడు), ఏ.సూర్యనారాయణ (తూర్పుగోదావరి జిల్లా ప్రెసిడెంట్), డి.శాంతికుమార్ (ఒకేషనల్ జూనియర్ కాలేజ్ రాష్ట్ర అధ్యక్షుడు), పలివెల వెంకటరమణ (ప్రైవేట్ జూనియర్ కాలేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు), చింతాడ ప్రదీప్ కుమార్ (పి.ఆర్.టి.యు.), లంకలపల్లి శ్రీనివాస్ (ఎస్.టి.యు.) అధ్యక్షుడు, చలపతి (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు), తిలక్ బాబు (శాసనమండలి ఎన్నికల కోఆర్డినేటర్), వాకాడ వెంకటరమణ (చిన్నా మాస్టర్-యంగ్ మైండ్స్ అధ్యక్షుడు) తదితరులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. సన్మాన గ్రహీత, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్.ఎల్.సి. పేరాబత్తుల రాజశేఖర్ తన ప్రసంగంలో, "ఇంత ప్రేమతో, ఆత్మీయతతో పిలిచి సత్కరించిన ఆదిత్య విద్యాసంస్థల అధినేతలకు, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులకు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నేతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ ఘనత నాకు కాకుండా, మీ అందరి ఆశీర్వాదానికి ఫలితం," అని పేర్కొన్నారు. అలాగే, ఈ కార్యక్రమ విజయవంతంగా జరగడానికి విశేషంగా కృషి చేసిన వాకాడ చిన్నమాస్టర్ ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమం రాష్ట్రంలోని విద్యా వేత్తల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. నైతిక విలువలతో కూడిన నాయకత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఈ సభ మరోసారి నిరూపించిందని కొనియాడారు

## మహా టీవీ పై జరిగిన దాడికి నిరసనగా అమలాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మహా టీవీ ప్రధాన కార్యాలయం సిబ్బందిపై టిఆర్ఎస్ నాయకుల దాడిని ఖండిస్తూ అమలాపురం ప్రెస్ క్లబ్ లోని ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా వారు ఆదివారం నాడు సాయంత్రం స్థానిక గడియార స్తంభం నుండి డి.ఎస్.పి కార్యాలయం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి పత్రికా స్వేచ్ఛను కాపాడాలి మహా న్యూస్ కార్యాలయం పై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం డిఎస్పి ప్రసాద్కు వినతిపత్రం జర్నలిస్టు అందరూ అందజేశారు జర్నలిస్టులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా సంఘీభావం తెలిపిన కూటమి నాయకులు, కాంగ్రెస్ నాయకులు.

## మంత్రి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి బీసీ నాయకులు



**ముమ్మిడివరం విశ్వం వాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరిగిన "సుపరిపాలనలో తొలి అడుగు " కార్యక్రమంలో భాగముగా ఆదివారం నాడు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ని మర్యాద పూర్వకముగా కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు నరసాపురం నియోజకవర్గ పరిశీలకులు గుత్తుల సాయి , ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి , రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు

# నిర్వాసితులు అంటే అంత చులకనా!

## కృష్ణునిపాలెం పునరావాస కాలనీ కి దిక్కెవరు?



**అల్లూరి జిల్లా (చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్)**

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం ఆంధ్రుల జీవనాడి గా పిలవబడే పోలవరం ఇరిగేషన్ ప్రాజక్ట్ లో గోదావరిని ఆనుకొని వున్నా ప్రధాన మండలం ఐనటువంటి దేవీ పట్నం మండలంలో సుమారు 44గ్రామాల 15000వేల కుటుంబాలు ముంపునకు గురి కావటం తో 18గ్రామాల్లో ఉన్నటువంటి గిరిజనేతరులను సుమారు 4000వెలమందిని గోకవరం మండలంలో గల కృష్ణునిపాలెం పంచాయితీ లో రాజుపాలెం దగ్గర పునరావాసం కల్పించారు... 2020లో బ్యాక్ వాటర్ ద్వారా నిర్వశితులు స్వయంగా గ్రామాలను కాళీ చేసి అసంపూర్ణంగా వున్నా పునరావాస కాలనీల్లో వారికీ చేటాయించిన నివాసలకు చేరుకున్నారు అయితే నాటి వైసీపీ ప్రభుత్వం లో కాంట్రాక్టర్లు నామ మాత్రంగా 26కాలమ్స్ వున్నా ఆర్డర్ ప్రకారం నిర్మించకుండా 14లేదా 15 కాలమ్స్ లో నిర్మించి చేతులు దులుపుకున్నారు...నాటి ప్రభుత్వం లో ఎంపీ నిధుల నుంచి సత్యసాయి త్రాగున్నీరుని త్యాంక్ నిర్మించారు కానీ ఒకరోజు వస్తే 10రోజులు ఎదురు చేసిడాల్సిన పరిస్థితి...

**విషయం:-** గత వైసీపీ ప్రభుత్వం లో పంచాయితీ నిధులను పక్కదారి పట్టించిన విషయం తెలిసిందే 2020నుంచి 2024ఎన్నికల వరకు మనం ఎక్కడ చుసిన ఏ పంచాయితీ వెతికిన పారిశుధ్యం ఎక్కడ కనిపించలేదు అడిగితే నిధులు లేవు అనే సాకు అడిగినావాళ్లాపై కేసులు పెడతారానే భయం...ఎన్నికిల తర్వాత నూతనంగా ఏర్పడ్డ %చీణాా% కూటమి ప్రభుత్వం రాష్ట్రం అంతటా ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి పంచాయితీ పరిస్థితులు తెలుసుకుని ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయితీ రాజ్ శాఖ మంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ పార్టీచూడకుండా రాష్ట్రం అంతటా వున్నా సర్పంచులకు నిధులు విడుదల చేయటం జరిగింది కానీ కృష్ణునిపాలెం పునరావాస కాలనిలో గల ఆరు పంచాయతీ గిరిజనేతరులకు అధికారం వచ్చిన గడిచిన కాలంలో ఒక్కరోజు కూడా శానిటైజేషన్ కానీ పారిశుధ్యం కానీ,బీచింగ్ చల్లటం కానీ జరగలేదు... కాలనీ దుస్థితి తెలుసుకుని క్రిస్టియన్ సంస్థ వారు కాలనిలో సుమారు చేతిపంపుకు 15నుంచి 20వరకు ఏర్పాటు చేసారు కానీ అందులో కొన్ని పాడైపోయాయి పంచాయితీ నుంచి ఏర్పాటు చెయ్యలేదు కనీసం మైంటెనెన్స్ కూడా లేకుండా పోయింది...లిఇదంత ఎందుకు చెప్తున్నా అంటే కాలానికి రెండు త్యాంక్స్ నిర్మించగా అందులో ఒకటి మోటర్ పోవటంతో సుమారు 15రోజులు నుంచి నిర్వశితులు నీటి సమస్యతో తల్లడిపోతున్నారు బోరు కొట్టించుకున్న వాళ్ళ ఇళ్లకెళ్లి నీళ్లు అడుక్కునే దుస్థితికి నిర్వశితులను దిగదార్చారు.. ఇటు ఏజెన్సీ కి చెందకుండా అటు ప్లైన్ ఏరియాకు చెందకుండా నిర్వశితుల జీవితాలతో ఆడుకుంటున్నారు...

కొంతమంది చెప్పే సమాధానం 18గ్రామాలకు సంబందించిన ప్రజలున్నారు మనమే ఎలా చెయ్యగలం అప్పటికి మా సొంత డబ్బును వెచ్చించి చేయిస్తున్నాం అంటూ కళ్ళబోల్లి మాటలు చెప్తున్నారు...అంటూ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చరుపు వెంకట్రాయుడు ఆరోపించారు ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి ఉన్న ఆరు పంచాయితీ ల సర్పంచులు సెక్రటరీ లు కూర్చుని ఈ 18గ్రామాల గిరాజానేతరుల తో మాట్లాడిన దాఖలు లేదని చర్యలు లేవని మరి పంచాయతీ కి విడుదల చేసిన నిధులు ఏమైనట్టు అంటూ ఆరోపించారు ఇటు అలానే జిల్లా లికలెక్టర్ మరియు నియోజకవర్గ శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి చొరవ తీసుకుని అధికారుల్లో చైతన్యం తీసుకు వచ్చి సర్పంచులు సెక్రటరీ ఎంపీడీఓ లతో చర్చించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం ఆయన అన్నారు. ముందుగా నీళ్లు ప్రజలకు అందించే విధంగా అధికారులు చర్యలు తుసుకోవాల్సిందిగా కోరుతున్నట్లు ఆయన తెలిపారు.





### గిరిజన గ్రామాలకు నాలుగు బోరింగ్ పంపు సెట్లు వితరణ.




**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** చింతూరు మండలంలోని అల్లిగూడెం, పావురా లంక, డి జగ్గారం మూడు గ్రామాలకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా త్రాగునీటి రిగ్గు వేయించి అనంతరం 72 వేల రూపాయల విలువగల నాలుగు బోరింగ్ హ్యాండిల్ సే ట్లను ఆదివారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామస్తులకు అందజేయడం జరిగింది. మారుమూల గిరిజన ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో గ్రామస్తులు జమాల్ ఖాన్ను త్రాగునీటి సౌకర్యం కల్పిం చాలని విన్నవించగా ఆయన దానికి స్పందించి . అల్లిగూడెంలో 2,దొంగల జగ్గారం,1 పావురాళ్ళంక1 మొత్తం నాలుగు బోర్లను వేయించడం జరిగింది. అనంతరం నాలుగు బోర్లకు సంబంధించి 72 వేల రూపాయల విలువగల హ్యాండిల్ సిట్లను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సోడి వెంకయ్య. శర్యం చిట్టిబాబు. కుంజ రఘువరన్. కురా భద్రయ్య, ట్రస్ట్ సభ్యులు పీ సాల్మన్ రాజు, జాన్ ప్రకాష్, ఎస్కే షాజహాన్, అబ్దుల్వహీద్ పాల్గొన్నారు.

### రెండు మూడు నెలల్లో శివకుమార్ సీఎం

**బెంగళూరు:** కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలో మార్పులు జరుగనున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే తెలిపారు. రెండు మూడు నెలల్లో డీకే శివకుమార్ సీఎం అవుతారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# మార్స్‌పై నీటి జాడలు!



ఈ అనంత విశ్వంలో ఎన్నో రహస్యాలున్నాయి. భూమిని పోలిన గ్రహాలతో పాటు శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఎన్నో మిస్టరీలను ఛేదించారు. మార్స్‌పై సైతం శాస్త్రవేత్తలో పరిశోధనలు చేపడుతున్న విషయం తెలిసిందే. మార్స్‌పై జీవం ఉన్నదా? అనే కోణంలో పరిశోధనలు సాగుతుండగా.. ఈ దిశగా కీలక పురోగతి చోటు చేసుకున్నది. నాసా క్యూరియాసిటీ రోవర్ తాజాగా మార్స్‌పై ఓ రహస్య ప్రాంతంలో తవ్వకాలు చేపట్టింది. ఈ ప్రాంతంలో అక్కడ భూగర్భంలో నీరు చాలాకాలం పాటు క్రియాశీలంగా ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఇది మార్స్ వాతావరణ చరిత్రను తిరగరాసే అవకాశం ఉన్నది. నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్ ప్రస్తుతం మౌంట్ షార్ప్ భాగంలోని బాక్స్‌వర్క్ ప్రాంతాన్ని పరిశీలిస్తోంది. ఇది మార్స్ ఉపరితలంపై 12 మైళ్ల పొడవున విస్తరించి ఉంది. ఇప్పటి వరకు ఇది కేవలం ఉపగ్రహాల ద్వారా మాత్రమే గమనించిన ఈ ప్రాంతానికి తొలిసారిగా రోవర్ చేరుకుంది. ఇక్కడి రాళ్లలో రాళ్లలో మెగ్నీషియం సల్ఫేట్, కాల్షియం సల్ఫేట్ వంటి ఉప్పు ఖనిజాలు అధికంగా ఉన్నట్లు గుర్తించింది. ఇవి సాధారణంగా నీరు ఆవిరైపోయిన తర్వాతే ఏర్పడుతాయి. దాంతో అక్కడ గతంలో నీరు ఉందని.. ఆ తర్వాత వాతావరణంలోని మార్పులతో ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నట్లుగా సూచిస్తున్నది. కేవలం మట్టి, ఖనిజాలే కాకుండా రాళ్లలో మినరల్ వీన్స్‌ని సైతం గుర్తించారు. నీరు చాలా కాలం పాటు భూగర్భంగా ప్రవహించి ఉండే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఇది నిజమైతే, మార్స్‌పై జీవనానికి అనువైన వాతావరణం భావించిన దానికంటే ఎక్కువ కాలం పాటు కొనసాగినట్లుగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రోవర్ రాళ్లను తవ్వి నమూనాలను సేకరిస్తోంది. వాటిని విశ్లేషించగా మార్స్ జలరాశులకు సంబంధించిన చరిత్ర, గ్రహ నిర్మాణ పరిణామాలపై కీలక సమాచారం లభించే అవకాశం ఉంది. మార్స్‌తో పాటు ఇతర గ్రహాలు, పలు గ్రహాల ఉపగ్రహాల్లోనూ నీటి ఉనికిని గుర్తించారు. భూమి ఉపగ్రహమైన చంద్రుడి ఉపరితలంపై 2009లో భారత్ చేపట్టిన చంద్రయాన్-1 మిషన్ ద్వారా దక్షిణ ధ్రువ ప్రాంతంలో నీటి జాడలను గుర్తించారు. అలాగే, జూపిటర్ ఉపగ్రహమైన యూరోపాలోనూ మంచుతో కప్పిన ఉపరితంలోని లోతుల్లో భారీ జలరాశులు ఉన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. బృహస్పతి ఉపగ్రహమైన గానిమీడ్ భూగర్భంలో సముద్రం ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. శని ఉపగ్రమైన ఎన్సెలడస్ ఉపరితలంలో నీరు మంచురూపంలో ఉందని అంచనా. టైటాన్‌లో మీథేన్, ఇథేన్ నిండిన ఉపగ్రహం.. ఉపరితంలో నీటి సముద్రం ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఐక్యరాజ్యసమితి ఏం చేస్తోంది

కొన్నేళ్లుగా ప్రపంచంలో యుద్ధాలు వివిధ దేశాల మధ్య జరుగుతున్నా అడ్డు కోవలసిన యుఎన్ఓ అసలు పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నదని ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి ఇది వాస్తవం కూడా. ఈనెలలో ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య అత్యంత భయానకంగా మొదలైన యుద్ధాన్ని కూడా నిలువరించే ప్రయత్నాలను ఐరాస చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి.మానవుని మనుగడ కోసం వనరులకు మరింతగా అవసరాలు తీర్చేందుకు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని గ్రహాంతరాల కు వెళ్లి మరీ ఖనిజాలు, నీటి వనరులు తదితర ప్రకృతి వనరులు కనుగొనే ప్రయత్నం చేస్తుంటే అదే పరిజ్ఞానం వినియోగించుకొని భూమండలంలో కొన్ని దేశాలు యుద్ధం పేరుతో విధ్వంసం సృష్టి స్తూ మానవ వినాశనం కోరుకోవటం క్షమించరాని నేరంఅసలు యుద్ధం అంటేనే ఒక అనాగరిక చర్య. ఇలాంటి అనాగరిక వ్యవస్థలో వున్న కొన్ని దేశాలను యుద్ధం నివారించేందుకు మరికొన్ని మా నవ సంక్షేమ కార్యక్రమాలకు భిన్నంగా మారకుండా ఉండే లక్ష్యంతో అమెరికాలోని న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి (యుఎన్ఓ) ఏర్పాటైంది. అయితే కొన్నేళ్లుగా ప్రపంచంలో యుద్ధాలు వివిధ దేశా ల మధ్య జరుగుతున్నా అడ్డు కోవలసిన యుఎన్ఓ అసలు పట్టించుకోకుండా ప్రేక్ష క పాత్ర వహిస్తున్నదని ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి ఇది వాస్తవం కూడా. ఇజ్రాయిల్, హమాస్, రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య సుమారు రెండేళ్లుగా జరుగు తున్న యుద్ధంలో ఆస్తి ప్రాణ నష్టాలు దా రుణంగా సంభవిస్తున్నా ఏ మాత్రం పట్టించుకోకపోగా ఈనెలలో ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య అత్యంత భయానకంగా మొదలైన యుద్ధాన్ని కూడా ఐరాస పట్టించుకు న్నట్టు కనిపించడం లేదు. పైగా రగులుతున్న రావణకాష్టంలో ఐరాసలో శాశ్వత సభ్యత్వం కలిగిన అగ్రదేశాలు మరింతగా ఆజ్యం పోస్తూ యుద్ధాన్ని ఉధృతం చేసే ప్రయత్నం చేయటం మరింత విషాదకరం. ఐక్యరాజ్యసమితి స్థాపనకు ముఖ్య కారణం పరిశీలిస్తే అసలు విషయాలు బోధపడతాయి. ఐరాస రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1945 అక్టోబర్ 24న అధికారికంగా ప్రారంభమైంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్


సోమవారం 30 జూన్ 2025
www.viswamvoice.com



# డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా సరోజినీ సేవలు అభినందనీయం

**రహదారి సౌకర్యం లేని అటవీ ప్రాంతాల్లో సైతం సమర్థవంతంగా సేవలు.. పదవీ విరమణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి**

**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్,రిపోర్టర్ :** డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎ.సరోజిని వైద్య,ఆరోగ్య శాఖలో చేసిన సేవలు ఎనలేనివని, రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రమ్యశ్రీ కొనియాడారు. 33 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా వివిధ హోదాలలో, ప్రజలకు నిస్వార్థ సేవలు అందించి రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గా జూన్ 29 ఆదివారం రోజున పదవీ విరమణ చేసిన అల్లంపల్లి సరోజిని ని మండల కేంద్రమైన రాయవరం గ్రామంలోని వెలమ కమ్యూనిటీ హాల్ నందు ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన పదవీ విరమణ సభలో ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. దుర్గారావు దొర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, రాష్ట్ర నలుమూలల నుండి సరోజినీ తో కలిసి పని చేసిన తోటి సిబ్బంది, అభిమానులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొనగా,ముఖ్యంగా హెల్త్ ఎడ్యుకేటర్ల నుండి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ గా పేరు మార్చబడడానికి సుదీర్ఘకాలం పోరాటం చేసామని, ఈ సమయంలో సరోజినీ అందించిన సహాయం,పడిన కష్టం, మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు




వెంకటరమణ తెలిపుతూ,రిటైర్మెంట్ చేరువలో ఉండగా, ఆ పోరాటం సఫలీకృతం అయిందని, సరోజినీ రిటైర్మెంట్ తో అనుబంధం తెంచుకుని ఆగిపోక, అసోసియేషన్ కు గౌరవ అధ్యక్షులుగా కొనసాగాలని సభాముఖంగా కోరారు, ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలైన బుట్టాయిగూడెం పరిసర గ్రామాలలో, రహదారి సౌకర్యం లేని చోట కూడా ఆమె విలువైన ఆరోగ్య సేవలు అందించారని,ఆ నిస్వార్థ సేవలు ప్రశంసనీయమని, ఆమె పనితనం స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో సరోజినీ జీవితం,పని విధానం గూర్చి ప్రారంభ పలుకులుగా ఉపాధ్యాయురాలు గరగ సీతామహాలక్ష్మి మాట్లాడిన పదాల అల్లిక మంత్రముగ్ధులను చేయగా,డిహెచ్ఇఓ అసోసియేషన్ ట్రెజరర్ హరి ప్రసాద్ సరోజినీ పై రచించిన గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, అనంతరం డి ఎం హెచ్ ఓ దుర్గారావు దొర పదవి విరమణ పత్రాన్ని అందచేసి,దుశ్శాలువా కప్పి సన్మానం చేశారు, పదవీ విరమణ తరువాత ఆరోగ్యకర, ఆనందకరమైన జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందమల్ల రామకృష్ణ, డాక్టర్ జి.ఎస్.ఎన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ అసోసియేషన్ సెక్రటరీ సిహెచ్ సుధాకర్ రావు, స్టేట్ ట్రెజరర్ హరిప్రసాద్, మహిళా సెక్రటరీ వై అనురాధ, బేగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ స్టేట్ లీడర్ భానుమూర్తి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ డి కృష్ణ శేఖర్,మాజీ ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు,నదురుబాద గ్రామ సర్పంచ్ సిహెచ్. శ్రీనివాసరావు, లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, రాయవరం,మాచవరం,పెదపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ళ...



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు సమావేశంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్.టి.జి శాఖ మంత్రి నారా లోకేష్ ను ఎమ్మెల్యే వేగుళ్ళ కలిసారు.మండపేట నియోజకవర్గ అభివృద్ధి కి ఎమ్మెల్యే వేగుళ్ళ చేస్తున్న కృషి నీ లోకేష్ అభినందించారు.

# కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయండి

రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జూలై 3, 2025న గంగవరం మండలంలో చిన్న,సన్న, కౌలు రైతుల సదస్సు ఘనంగా నిర్వహించబోతున్నామని,ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాల ప్రతినిధులు, ఉద్యమ నేతలు,ప్రగతిశీల సంఘాలు పాల్గొంటున్నారని ఐ.ఎఫ్.టీ.యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మరియు ఏ.ఐ.కే.ఎం.ఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమా శంకరం తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ కౌలు రైతులు దేశ వ్యవసాయ రంగానికి వెన్నెముకల వంటివారు, కానీ వారికి చట్టపరమైన హక్కులు,భద్రతలు లేవు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల రిజిస్ట్రేషన్ మరియు సంక్షేమ చట్టం – 2011 ఉన్నప్పటికీ,దాన్ని పూర్తిగా అమలు చేయడం లేదు. ఈ



చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తించి, రుణాలు,పంట బీమా, నష్టపరిహారం,ప్రభుత్వ పథకాలందుబాటులోకి తేవాలి.కానీ ఇప్పటికీ వేలాది మంది రైతులు గుర్తింపు లేక నష్టపోతున్నారు అన్నారు. ఈ చట్టాన్ని గ్రామ స్థాయిలో అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.కౌలు రైతులను గుర్తించి, నమోదు చేసి,వారికి అధికారిక కార్డులు ఇవ్వాలి,అప్పుడే రైతుల జీవితాల్లో నిజమైన భరోసా కలుగుతుంది అని పేర్కొన్నారు. సదస్సులో కౌలు చట్టం అమలుపై స్పష్టమైన తీర్మానాలు తీసుకోబోతున్నట్టు, భవిష్యత్ ఉద్యమ దిశలో నిర్ణయాలు తీసుకోనున్నట్టు నేతలు తెలిపారు. ఏఐకేఎంఎస్ రామచంద్రపురం డివిజన్ కమిటీ సంఘ నాయకులు, ప్రజాసంఘాలు,రైతు సంఘాలు,ప్రగతిశీల వ్యక్తులు ఈ సదస్సులో భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యూ రాష్ట సహాయ కార్యదర్శి బి. సిద్ధూ,రైతు కూలీ సంఘం నాయకులు రావి భాను, సుందరపల్లి అప్పారావు, జనిపల్లి ప్రసాద్,ఖండవల్లి శ్రీనివాస్,కాలకూర్చ చిన్నారావు,ఖండవల్లి సత్యనారాయణ, మోరంపూడి సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## చేతులు మట్టిలో - దేశం మదిలో నినాదంతో సిఐఓ దేశ వ్యాప్త ఉద్యమం...

**చెట్ల రక్షణే భవిష్యత్తు పరిరక్షణ జమాతె ఇస్లామీ హింద్ మండపేట శాఖ...**



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** జమాతె ఇస్లామీ హింద్ పిల్లల్లో నైతిక పరివర్తన కొరకు వారిలో క్రమశిక్షణను పెంపొందింపజేసి దేశ ప్రగతిలో ఉత్తమ పౌరులుగా నిలిపేందుకు మొదటి నుండి కృషి చేస్తూ ఉందని ఇందులో భాగంగా చిల్డ్రన్స్ ఇస్లామీక్ ఆర్గనైజేషన్ ( సి ఐ ఓ ) ద్వారా దేశ వ్యాప్త అనేక కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. ఈ నెల 29 నుండి జూలై 26 వరకు పిల్లల్లో పర్యావరణ పరిరక్షణ అవగాహనను కలుగుజేయడం కోసం చేతులు మట్టిలో – దేశం మదిలో.అనే శీర్షికతో దేశ వ్యాపి ఉద్యమాన్ని ప్రారంభించిందని జమాతె ఇస్లాం హింద్ స్థానిక అధ్యక్షులు ఫారుఖ్ తెలియజేశారు.ఈ సందర్భంగా మండపేట పరిసర ప్రాంతాలలో పిల్లలతో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా జమాతె కార్యలయంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో జమాతె స్థానిక మహిళా అధ్యక్షురాలు అయేషా జమీలా మాట్లాడుతూ పిల్లలు దైవం ప్రసాదించిన బహుమానంగా భావించి వారి సామర్థ్యలకు అనుగుణంగా వారికి తర్ఫీదు ను ఇచ్చి దేశ ప్రగతిలో భాగస్వాములు చేయాలని ఆమె పిలుపునిచ్చారు.పరిసర ప్రాంతాలలో ని పిల్లలు ఆధిక సంఖ్యలో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు.అనంతరం. పచ్చదనంతోనే స్వచ్ఛ భారత్ సాధ్యం,చెట్లు నాటుదాం కాలుష్యాన్ని తరుముదాం, చెట్ల రక్షణే భవిష్యత్తు పరిరక్షణ అని నినాదలు చేశారు.ఈ కార్యక్రమంలో జమాఅతె సభ్యులు రిజ్వాన్,టిచర్ అలి,మహిళా సభ్యులు,కార్యకర్తలు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం సిపిఐ ఆధ్వర్యంలో ఏరియా 18వ మహాసభ

**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రామచంద్రపురం ఏరియా 18వ మహాసభ డాక్టర్ చెలికాని రామారావు భవనంలో ఘనంగా జరిగింది.ముందుగా పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు పెదపాటి నరసింహారావు ఎగురవేశారు,ఆయన మాట్లాడుతూ సిపిఐ ఏరియా మహాసభ జయప్రదం కావాలని అన్నారు.ఈ మహాసభ కి అధ్యక్ష వర్గంగా ఏఐటీయూసీ నాయకులు వి గోపాలరావు ప్రజానాట్యమండలి నాయకులు వి.రాంబాబు వ్యవహరించారు దీనికి ముఖ్యఅతిథిగా సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ దేగ ప్రభాకర్ రావు హాజరై నారు.ఈ మహాసభలో ముందుగా అధ్యక్ష వర్గం అనుమతితో మృతి చెందిన పార్టీ నాయకులకు,సభ్యులకు, మరియు సానుభూతిపరులకు సంతాపం తెలియజేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.రాష్ట్ర నాయకులైన కామ్రేడ్ దేగ ప్రభాకర్ మాట్లాడుతూ ఈరోజు ప్రపంచాన్ని గమనించినట్లయితే సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాల పేరుతో ప్రపంచ ప్రజలకు శాంతి సుఖమైన జీవితాన్ని లేకుండా చేస్తున్నారని అన్నారు. అలాగే భారతదేశంలో గత సుమారు మూడున్నర దశాబ్దాలుగా నూతన ఆర్థిక సరళీకరణ విధానాల పేరుతో అంతర్జాతీయ,జాతీయ పెట్టుబడిదారీ శక్తులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలుని లొంగదీసుకుని వారి సంపదను పెంచుకోవడానికి అవసరమైన విధానాలు అమలు చేస్తున్నారు. ఉదాహరణకు 44 కార్మిక చట్టాల రద్దుచేసి కార్మిక హక్కుల కాలమరాయుడు, రైతులకు వ్యతిరేకంగా మూడు నల్లా




చట్టాలు, సామాజిక న్యాయం, ఆత్మగౌరవంతో బ్రతకడానికి అండగా ఉన్న ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు వారికి కారు చౌకగా అమ్మడం లాంటి దుర్మార్గమైన విధానాలను అమలు చేస్తున్నారు. అందువల్ల ఈ దేశంలో ప్రజల్లో వ్యతిరేకత వస్తుంటే,సమైక్యతతో కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల్లో మత విద్వేషాలు, కులతత్వాలు రెచ్చగొట్టి వారి పాలన కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా త్యాగాలతో పునీతమైన భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులమైన మనమందరం ప్రజలకు ఎదుర్కొంటున్న నిరుద్యోగం,అధిక ధరలు, దోపిడి విధానాలలో వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ 100 వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జరిగే మహాసభలు జయప్రదం చేసుకొని,నిర్మాణం పెంచుకొని ప్రజా,కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలని అన్నారు. అలాగే ఏరియా కార్యదర్శి పెద్దిరెడ్డి రాము గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు జరిగిన కార్యక్రమం రిపోర్ట్ ప్రవేశపెట్టగాచర్చించి ఆమోదించారు.డాక్టర్ చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ పార్టీ సభ్యులందరూ సిద్ధాంతం పట్ల అవగాహన పొందేటట్లు రాజకీయ శిక్షణ తరగతులు చేపట్టాలన్నారు.అలాగే జులై 19,20,21 తేదీల్లో అమలాపురంలో జరుగు సి.పి.ఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ వి.శామ్యూల్ మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా మహాసభ జులై 6 తేదీన రామచంద్రపురం డాక్టర్ చెలికాని రామారావుగారి భవనంలో జరుగుతుందని,దానిలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హంస అవార్డు గ్రహీతలైన గొర్రెల రాము,ఏలూరు సరోజ,మరియు పశ్చిమగోదావరి జిల్లా చెందిన సబ్బి కనకారావు అభినందన సత్కారములు జరుగునని తెలిపారు. ప్రజానాట్యమండలి కార్యకర్తలు,సభ్యులు మరియు కళాకారులు అందరూ కలిసి ప్రజానాట్యమండలి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని అన్నారు .ఈ మహాసభలో సి.పి.ఐ ఏరియా కార్యదర్శిగా పెద్దిరెడ్డి రాము,సహాయ కార్యదర్శిగా వి రాంబాబుని మరియు 13 మందిని కార్యవర్గ సభ్యులుగా పాత కార్యవర్గం ప్రతిపాదనపట్టగా సభ్యులు ఆమోదించారు. అనంతరం సిపిఐ నాయకురాలు ఎస్. శారదా దేవి ఈ మహాసభ జయప్రదం చేసిన కామ్రేడ్స్ అందరికీ అభినందనలు తెలిపారు.

## కలెక్టరేట్లో యధావిధిగా స్పందన సమస్యల పరిష్కార వేదిక కలెక్టర్



**అమలాపురం, జిల్లా ప్రతినిధి, విశ్వం వాయిస్ జూన్ 29** ఈనెల 30 వ తేదీ సోమ వారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) ద్వారా అర్జీ దారుల వినతులను స్వీకరించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివా రం ఒక ప్రకటనలో తెలి పారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం (పీజీ ఆర్ఎస్) ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్ట నున్నట్టు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాలలోను 4 మునిసిపల్ ప్రధాన కార్యాలయాలలోనూ 22మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తార న్నారు. ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసు కోవాలని జిల్లాకలె క్టర్ తెలిపారు. అదేవి ధంగా అర్జీదారులు తమ అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతు లు సంబంధిత సమాచా రం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు. కావున అర్జీదా రులు జిల్లా, డివిజన్, మండల నిర్దేశిత స్థాయిల లోనీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ఆశ్రయించి తమ తమ సమస్యలకు తగు పరి ష్కార మార్గాలు పొందాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

## అంబేడ్కర్ సామాజిక భవన పరిరక్షణ

# అభివృద్ధి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**రాజోలు విశ్వం వాయిస్ న్యూస్ :-** రాజోలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక భవనం పరిరక్షణ అభివృద్ధి కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కాబడింది.ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు అంబేద్కర్ సామాజిక భవనంలో పరిరక్షణ అభివృద్ధి కమిటీ సమావేశం ప్రముఖ న్యాయవాది జాలెం భాస్కరరావు అధ్యక్షతన ఆదివారం కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సమావేశంలో రాజోలు అంబేద్కర్ సామాజిక భవన పరిరక్షణ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా డాక్టర్ గేదెల వరలక్ష్మిని,ప్రధాన కార్యదర్శిగా మట్టా సురేష్ కుమార్ ను, కోశాధికారులుగా చింతా శ్రీనివాస్,చింతా సత్య వరప్రసాద్ లను, నిర్వాహక కమిటీ సభ్యులుగా విప్పర్తి సాయిబాబు,మట్టా



ఏడుకొండలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం నూతన కమిటీ సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. నూతన కార్యనిర్వాహక సభ్యులను కమిటీ సభ్యులైన గెడ్డం పేర్రాజు, వైస్ ఎంపీపీ పొలుమూరి శ్యాంబాబు,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవాధ్యక్షులు దేవ రాజేంద్రప్రసాద్,పీడియం రాష్ట్ర నాయకులు దీపాటి శివప్రసాద్,దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, చిలకపాటి శ్రీధర్ ఎస్సీ సంక్షేమ సంఘ నాయకులు తోటే ప్రతాప్, కొల్లాబత్తుల సతీష్, మెడబల రాజు కుమార్, జిల్లెళ్ళ వినోద్,బొడ్డపల్లి ప్రసాద్,బుంగ శ్రీను, పుల్లెళ్ళ ఆనంద్,ఎలుమర్తి వెంకట్ తదితరులు అభినందించారు.

## మహా న్యూస్ కార్యాలయంపై బిఆర్ఎస్. మూకల దాడిని ఖండించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంటెద్దు బాబి



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** ప్రముఖ మీడియా ఛానల్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయం పై బిఆర్ఎస్ మూకల దాడిని అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు కేకేసి రాష్ట్ర అధికార ప్రతినిధి వంటెద్దు బాబి తీవ్రంగా ఖండించారు. వాస్తవాలు జీర్ణించుకోలేక కథనాలకు భయపడి మహా న్యూస్ సిబ్బందిపై దాడి చేయటం అన్యాయమని ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా దాడి చేసిన వారిపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బాబి కోరారు



# తప్పుడు ఏటీఎస్ విధానం వల్ల మోటారు వాహనాలకు ముప్పు

## ఏపీ టాక్సీ ఓనర్స్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రోడ్డు రవాణా వాహనాల సామర్థ్యాన్ని నిర్ణయించేందుకు ప్రభుత్వం చే ప్రవేశపెట్టబడిన ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం పూర్తిగా లోప భూష్టమైనదని అది రోడ్డు రవాణా కార్మికుల జీవితాలకు పెనుముప్పుగాను పరిణమించిందని ఇట్టి విధానాన్ని అవలంబిస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మేల్కొని ఏటీఎస్ విధానాన్ని రద్దుపరిచి సరిదిద్దుకోవాలని వివిధ తరహా వాహనాల కు చెందిన ఏపీ టాక్సీ ఓనర్స్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా రోడ్డు రవాణా అధికారి కె.సురేష్ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాల సామర్థ్యాన్ని నిర్ధారించడం కోసం ప్రవేశపెట్టిన ఆటోమెటిక్ టెస్టింగ్ సిస్టం (ఏ టి ఎస్) అనేది అభ్యంతరకరమైన విధానమని ఈ విధానంతో ఏర్పడుతున్న దుష్ట పరిణామాల వల్ల మోటారు వాహనాల వాస్తవ సామర్థ్యం గుర్తింపబడకపోగా సదరు వాహనానికి చెందిన ఇంజన్ , టైర్లు తదితర కీలకమైన భాగాలకు హాని ఏర్పడుతున్న పరిస్థితులలో తక్షణం ఈ విధానాన్ని నిలిపివేయాలన్నారు. ఏవో కొన్ని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ ఏ టి ఎస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టినప్పటికీ అమలు జరిపే విషయంలో ఆయా రాష్ట్రా ప్రభుత్వాలు తమ తమ విచక్షణ మేరకు అమలు చేయుటమా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోవచ్చని వెసులుబాటు కూడా విధించగా మనదేశంలో పలు రాష్ట్రాలు విజ్ఞతతో ఆలోచించి ఆయా



రాష్ట్రాలలో ఈ లోప భూయిష్టమైన ఏ టి ఎస్ ను అమలు చేయకుండా జాగ్రత్త పడగా మన రాష్ట్రంలో మాత్రం ఈ ఏటీఎస్ ను అమలు జరపటం అనేది కొరివితో తల గోక్కోవడమేనని వెంటనే దీనిని నిలిపివేయాలన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ కోశాధికారి దొమ్మేటి సోమశంకర్ మాట్లాడుతూ, వాహనాల పిట్నెస్ సామర్థ్యం అనేది రవాణా కార్మికుల బ్రతుకు భద్రత కోసమే తప్ప బడా బాబుల జేబులు నింపడానికి కాకూడదని ఏటిఎస్ విధానం ప్రైవేటు కాంట్రాక్టర్ల లబ్ధి కోసం ఉద్దేశించబడిన గుత్తాది పత్య విధానంగా ఉందని ఈ విధానాన్ని రద్దుచేసి ఎప్పటిలా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగు లైన వ్యక్తులచే వాహన సామర్థ్యాన్ని నిర్ధారించే బాధ్యతలను తక్షణం ప్రవేశపెట్టాలన్నారు. సంబంధిత సాంకేతిక నైపుణ్యం అనుభవం కలిగిన ఆర్టీవో కార్యాలయం వారి ఆధ్వర్యంలో వాహన సామర్థ్యం నిర్ధారించబడటమే సరి అయిన ప్రక్రియ అని ఉద్యో గుల ఉద్యోగ ధర్మానికి లోబడి విధి నిర్వహణ చేయగలరని కాంట్రాక్ట్ విధానంలో సాంకేతిక ప్రతిభను జవాబు దారిని ఆశించలేమని దొమ్మేటి వివరించారు సమావేశంలో పాల్గొన్న వివిధ మోటార్ వాహనాల యూనియన్ లకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ, తమకు బ్రతుకు భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం ఉందన్న భావాన్ని వక్రీకరించారని, అంతేకాక ఏ పరిస్థితుల్లోనైనా ఫిట్నెస్ ప్రక్రియను తమ తమ వాహనాలు కు చేయించుకోవడం ఆలస్యమైన పక్షంలో అపరాధ రుసుంతో పాటు మరల నూతనంగా చలానా చెల్లించవలసినటువంటి పరిస్థితులు వస్తున్నాయని, చలానా రుసుములు విపరీతంగా పెంచి ఏ టి ఎస్ కాంట్రాక్టర్లు ఫిట్నెస్ ఫీజును ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నారన్నారు. ఒక వేళ అదృష్టవశాత్తు ఫిట్నెస్ నిర్ధారణ అయితే ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి పెద్ద ఎత్తున సుమారు 5000 వరకు అక్రమ వసూళ్లకు తెగబడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు తమ బ్రతుకు బండికి భద్రత కరువైందని తమకు జీవించే హక్కు కి భంగం కలుగుతుందని ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించుకుంటే జూలై ఒకటో తేదీన బ్రతుకు రక్షణ కోసం కార్యాచరణకు పూనుకోవాల్సి ఉంటుందని సమావేశం ఖరాఖండీగా వెల్లడించింది. ఈ సమావేశంలో నార్గాని వసంత కుమార్, ఎన్ వి సత్యనారాయణ, ఏ వి వి సత్యనారాయణ, దేవుడు, సోమేశ్, విన్నకోట మోహన్, జనపరెడ్డి కుమార్, బోరా శ్రీనివాస్, ముద్దుల కిరణ్ కుమార్, రాయుడు త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృ బాషలోనే ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్‌లను అమలు చేయాలి

## రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేర పరిశోధన జ్యుడిషియరి పోలీస్ లను నియమించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సూచించారు.. పిర్యాదుల మేరకు మాత్రమే ఎఫ్ ఐ ఆర్ లను నమోదు చేసే అధికారం ఉండాలని , అది కూడా మాతృ బాష లోనే వుండే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సంస్కరణలను అమలు చేయాలని , కేసులకు సంబందించిన పూర్తి ప్రక్రియ అంత మాతృ బాష లోనే అమలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం అమలవుతున్న ఎఫ్ ఐ ఆర్ (154 సి ఆర్ పి సి) ఆంగ్ల విధానాలతో బాధితులు అనాదిగా మోసపోతున్నారు . ముద్దాయిలు తప్పించు కుంటున్నారు . అమాయక ముద్దాయిలు బలై పోతున్నారు . ప్రభుత్వ న్యాయవాదులు, వాది, ప్రతివాదుల న్యాయవాదులు న్యాయాన్ని గెలిపిస్తున్నారో , అమ్మేస్తున్నారో వాది, ప్రతి వాదులకు అర్థం కావటం లేదు, ముద్దాయిలకు, అమాయక ముద్దాయిలకు ఏమి జరిగిందో ఎలా గెలిచామో, ఎలా ఒడి పోయమో అర్థం కాని పరిస్థితులు ఆంగ్ల నేర పరిశోధన విధానాలు నిత్యం సమాజాన్ని వెంటాడుతు వేధిస్తున్నాయి . నేటి ఆంగ్ల నేర పరిశోధన ఎక్కువ శాతం తప్పులు చేసే వారికి, నేరస్తులకు, ఆర్థిక నేరగాళ్లకు మాత్రమే అనువుగా ఉందనే అపోహలు సామాన్య ప్రజల హృద యాలను నిత్యం వేధిస్తున్నాయి. నేటి నేరపరిశోదన విధానాలు అంటే చట్టంతో వేధించటం.న్యాయంతో శిక్షిటంగా అమలు జరుగుతుందని . రాజ్యాంగ బద్ధమైన హక్కులకు, స్వేచ్ఛ కు మన వ్యవస్థలో విలువ లేకుండా పోతుందని , సగటు పౌరులు నేడు నేరస్తులకు ఒక రకంగా భయపడుతున్నాదని . చట్టం , న్యాయాలను ఆశ్రయించటానికి మరో విధంగా భయపడు తున్నారని, రక్షణ పొందగలమనే నమ్మకం సామాన్యులకు లేకుండా పోయిందని ఆయన తీవ్ర ఆవేదన చెందారు . పోలీస్ శాఖ కు కేవలం బాధిత పిర్యాదు మేరకు విచారణ జరిపి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసే అధికారం మాత్రమే ఉండాలని , కేసు పూర్తి దర్యాప్తుతో ఛార్జిషీట్ దాఖలు చేసే సర్వోన్నత అధికారం సాధారణ పోలీస్ కు సంబంధం లేని ఒక ప్రత్యేక జ్యూడిషియరీ పోలీస్ శాఖ ను ఏర్పాటు చేయాలన్నారు. , ప్రస్తుత విచారణ ప్రక్రియ గమనిస్తే అర్థవంతంగా సామాన్యుల జీవితాలు ముగిసి పోతున్నాయని, . చట్టం కాపాడుతుంది . న్యాయం రక్షిస్తుంది అనే నమ్మకాన్ని పౌరులు రోజు రోజు కు కోల్పోతున్నారన్నారు. . హక్కుతో కేసు కట్టించుకోవటం సగటు భారతీయుడికి సాధ్యం కాని పనిగా వుందని, ఒక బాధితుడు పిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలంటే ఖచ్చితంగా ఒక స్థానిక నేత అండ అయినా వుండాలి . లేకుంటే సొమ్ములు అయినా ఉండాలి. ఇవి ఏమి లేకుంటే న్యాయం పొందటం ఎడారిలో బావి వంటిదేనని , ప్రస్తుత



సమాజంలో సంఘ విద్రోహులు కన్నా కొంతమంది పాలకులను , పోలీస్ లను చూస్తేనే ప్రజలు భయపడుతున్నారన్నారు. . పోలీస్ పని తీరుకు భయపడి ఎందరో బాధితులు, అబాగ్యులు పోలీస్ స్టేషన్ కు వెళ్ళటానికి భయ పడి ఇంట్లోనే బిక్కు బిక్కు మంటూ భయంతో జీవిస్తున్నారని, . సాధారణ నేరాలకు సంబంధించి కేసు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసే హాక్కు మాత్రమే పోలీస్ లకు కల్పించి , కొన్ని క్రూర నేరాలకు సంబంధించి రేపిడ్ పోలీస్ స్టేషన్ల ను ఏర్పాటు చేస్తే కొంతమేరకు శాంతి భద్రతలు సజావు స్థితికి వస్తాయేమో నని ప్రభుత్వం పరిశీలన చేయాలని, మెరుగైన సంస్కరణ లుతో పోలీస్ విధానాలను ప్రవేశ పెట్టాల్సిన అవసరం వుందని మేధావులు, మంచి పాలకులు గుర్తించాలని ఆయన కోరారు. నిజమైన నేరాలు ఋజువు కావటానికి ప్రతి జిల్లా లోను నేర పరిశోధన శాస్త్రీయ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్తులు భయట దర్జాగా వుంటున్నారని, నిర్దోషులు జైళ్ళ లో వుంటున్నారని, నేర గణాంకాల ప్రకారం మొత్తం ఖైదీల సంఖ్య 5 లక్షల 73 వేలుగా ఉండగా 4 లక్షల 37 వేల మంది బెయిల్స్ లేకుండా జైళ్ళలో మగ్గి పోతున్నారన్నారు. . 24 వేల మందిపై విచారణలే ముగియలేదన్నారు. గత 5 ఏళ్లుగా 11 వేల మంది మంది న్యాయం అందక మగ్గి పోతున్నారని, . ప్రస్తుత సాధారణ పోలీసు లకు నేర పరిశోధన లో కనీస పరిజ్ఞానం కూడా లేకుండా పోతుందని . పోలీస్ లు కేసులు కదుతున్నారని, న్యాయస్థానాల్లో పోలీస్ కేసులు వీగి పోతున్నాయన్నారు. సాధారణ పోలీస్ లు దాఖలు చేసే చార్జషీట్ లన్ని డీటేక్టివ్ కధలు వలే ఒకే కధ అన్ని కేసుల్లోను నడుస్తుందని, . వాస్తవ నేర ఘటన దర్యాప్తు నివేదికలో మచ్చుకు సైతం కనపడదన్నారు. ప్రత్యేక్ష నేరాలను మన పోలీస్ లు చీకటి నేరాలుగా భూ స్థాపితం చేసేస్తున్నారని, . నేరం మాత్రం సజీవం గానే ఉంటుందన్నారు. . నేరం ఒకటైతే, దర్యాప్తు నేరం మరోలా ఉంటుందని, ఇక న్యాయం అందని ద్రాక్ష గానే మిగిలి పోతుందన్నారు. ఆటవిక పాలనతో నేరాన్ని సామాజిక న్యాయం అనే భ్రమలో బ్రతకటానికి ప్రజలను కట్టు బానిసలుగా మార్చేసారని, . మన ఓట్లు వేసి ఎన్నుకునే నేతకు రాజ్యాంగంపై అవగాహన ఉండదని, ప్రభుత్వ ఉద్యోగికి చట్టం తెలియదని, . అవినీతి మాత్రమే నేరగాడిని , నిర్దోషిని శాసిస్తుందనేది మాత్రమే నిజం అని ఆయన తీవ్ర మనస్థాపం చెందారు. పోలీస్ లకు పని ఒత్తిడి కావొచ్చును , అధికారుల ఒత్తిడి, వేధింపులు కావొచ్చును ఏదో ఒక కారణం చేత కానిస్టేబుల్ నుండి ఎస్ ఐ వరకు భరించలేని మానసిక ఒత్తిడికి గురవుతూనే వుంటున్నారని , ఆ విధమైన ఒత్తిడిలో విధులు నిర్వహించే సమయంలో కాస్త చికాకు, అసహనం ఏర్పడటం సహజ లక్షణం . అలాంటి పరిస్థితుల్లో ఫిర్యాదులు కోసం వచ్చే బాధితులు పట్ల సరైన రీతిలో స్పందించక కాస్త క్రూరంగా కనపడుతుంటారని, అనేక సందర్భాల్లో పాలకులు పోలీస్ లకు వారం సెలవులు ప్రకటిస్తాం అంటూ వారిని దగా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పోలీస్ లకు పాలకులు చేసిన వాగ్దానం మేరకు వారం సెలవులు ప్రకటించి పోలీసులకు మానసిక ఒత్తిడి లేని మంచి వాతావరణాన్ని కల్పించాలన్నారు. . ప్రస్తుతం అమలవుతున్న బూజు పట్టిన నేర పరిశోదన విధానాల్లో మెరుగైన సంస్కరణలతో సాధారణ పోలీస్ లకు ఎఫ్ ఐ ఆర్ వరకు మాత్రమే అధికారం వుండే విధంగాను, నేరం తీవ్రతను బట్టి అరెస్ట్ లకు రేపిడ్ పోలీస్ లను, ఛార్జిషీట్ దాఖలు కోసం జ్యుడిషియరి పోలీస్ ను మూడు విభాగలుగా ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు దృష్టి సారించాలన్నారు. భారతదేశంలో రాజ్యాంగం , చట్టాలు అమలు కావటం లేదని, . న్యాయంస్థానాల్లో న్యాయం ఖరీదైనాదిగా బాధితులను వేధిస్తుందని, చట్టాలు అమలు కాని సమాజం . హక్కులు పొందలేని పౌరులతో కట్టడి చేయలేని ప్రజా తిరుగుబాటు పురుడు పోసుకుంటాయని మేడా శ్రీనివాస్ అన్నారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , సిమ్మా దుర్గారావు , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్, మేడిచర్ల శ్రీనివాసరావు, సుంకర వెంకట భాస్కర రంగారావు , ముప్పన రమేష్ , ఆకుల మణికాంత్ , కారుమూరి యుగంధర్, పసుపులేటి వీర్రాజు , చల్లా సాంబశివరావు , చల్లా అఖిల్ , పెదిరెడ్డి కొండలరావు, మాసా అప్పాయమ్మ , మాసా సుభద్ర , మాసా కుశలయ్య , అడపా శేషగిరి, పాల్గొన్నారు .

# నగరంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ 37వ డివిజన్లో పర్యటన

### 10వ డివిజన్ తెలుకులవాని పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు పనులు ప్రారంభం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్, జూన్ 29 :** నగరంలోని అన్ని ప్రాంతాల కోసం తాము నిత్యం కృషి చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 37వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అలాగే 10వ డివిజన్ పరిధిలోని తెలుకుల వాని చెరువు పార్కులో సందర్శకులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ. 10 లక్షలతో విద్యుత్ ఏర్పాటు కోసం ఆ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అనవసరమైన పనులు కాకుండా ప్రజలకు ఏం అవసరమో ఆ అభివృద్ధి పనులు మాత్రమే చేస్తున్నామన్నారు. గత వైకాపా పాలకుల్లా అరకొర పనులు, ప్రజలు ఇబ్బందిపడేలా అనాలోచిత పనులు కాకుండా పూర్తి ఆలోచనలు, పక్కా ప్రణాళికతో శాశ్వతంగా నిలిచి ఉండేలా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. 2027లో జరిగే పుష్కరాల నాటికి నగరం సర్వాంగ సుందరంగా ఉంటుందని, నగరంలో జరిగే పనులన్నీ కూడా పుష్కరాలకు ముందు... పుష్కరాల తరువాత అనే రీతిలో ఉంటాయన్నారు. ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు, వ్యాయామాలు చేసుకునేందుకు నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కుల్లో జిమ్ సామాగ్రి, వాకింగ్ ట్రాక్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# దళిత జాతిలో రత్నం వంటి వ్యక్తి జవహర్

### ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ సన్మానం సమకాలిన రాజకీయాలలో ఒక చరిత్ర

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సినిమాటో గ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్,

### సమానత్వం కోసం కృషి చేస్తా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్, జూన్ 29 :** దళిత జాతిలో జవహర్ ఆభరణం రత్నం వంటి వ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సినిమాటో గ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తపల్లి శామ్యూల్ జవహర్ ను ఎస్సీ కమీష చైర్మన్ గా నియమించడం పట్ల దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్లో ఎస్సీ కమీష చైర్మన్ కొత్తపల్లి జవహర్, దంపతులకు ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా బోయిలపల్లి సుందరయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సినిమాటో గ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జవహర్ కు అప్పగించారని పేర్కొన్నారు. జవహర్ అంటే అర్థం ఆభరణం రత్నం అని తెలిపారు. దళితులలో ఆభరణం వంటి రత్నం కొత్తపల్లి శామ్యూల్ జవహర్ అని కొనియాడారు. జవహర్ కు ఈ పదవి పెద్దది కాదని ఆ పదవికి ఆయన ఆభరణం వంటి వారిని అన్నారు. తాము ఇద్దరం రాజకీయాల్లో వేరువేరు పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయాలలో నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం జవహర్ అని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల వారందరికీ సముచిత స్థానం కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జవహర్ కు ఎస్సీ కమిషన్ చైర్మన్ గా అవకాశం కల్పించారని అన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ గా ఏ ఇబ్బంది వచ్చినా కలెక్టర్ ను, ఎస్పీని సమాధానం చెప్పండి అని నిలదీసే అధికారం ఎసిసి కమిషన్ చైర్మన్ గా జవహర్ కు ఉందని అన్నారు. నూటికి నూరు శాతం దళిత వర్గాలకు సముచిత న్యాయం అందించగల వ్యక్తి జవహర్ అని అన్నారు. ఆయన మృదుస్వభావి అని, భార్య భర్తలు ఇద్దరూ టీచర్లు గా పనిచేశారని అన్నారు. వారి కుటుంబం ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చింది కనుక ఎస్సీలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ జవహర్ కు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జవహర్ మంత్రిగా ఉన్న రోజులలో ఎమ్మెల్సీగా ఉన్నానని పక్కపక్క సీట్లలోనే కూర్చుండే వారమని గుర్తు చేసుకున్నారు. తాను అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలపై ఒక స్లిప్ ఇస్తే వెంటనే పరిష్కరించి తాను సమస్యలు పరిష్కరించినట్లు మరో స్లిప్పు అందజేసేవారని వివరించారు. ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించడం లో ముందు ఉంటారని అన్నారు. ఎస్సీలలో మాల, మాదిగ, రెల్లీ , ఇతర 62 ఉప కులాలు వారు ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చునని సూచించారు. సన్మాన గ్రహీత ఎస్సి కమిషన్ చైర్మన్ కొత్తపల్లి సామ్యూల్ జవహర్ మాట్లాడుతూ తాను వివక్షతను ఎదుర్కొన్నానని అలాంటి తనకు వివక్ష రూపుమాపే బాధ్యతలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీలలో ఉన్న అన్ని కులాల కు సమానత్వం తో జీవించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ కులాలవారు బట్టలకు, మద్యం కు లోబడతారని అగ్రవర్ణాలలో అభిప్రాయం ఉందని దానిని రూపుమాపాల్సిన అవసరం ఉందని అన్నారు. బానిసలుగా బ్రతకవద్దని ధైర్యంగా నిటారుగా నిలబడి మిమ్మల్ని తక్కువ చేసిన వారిని ఎక్కువ చేయవద్దని సూచించారు. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నాయని వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించుకుని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సీలలో ఉన్న అన్ని కులాలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని సూచించారు. తాను ఎస్సీ కులాలకు సమానత్వం వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హక్కుల కోసం పోరాటం చేయకుండా తెల్ల జెండా ఊపితే సమస్యలు పరిష్కారం కావాలని అన్నారు. తమ హక్కుల కోసం పోరాడి సాధించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఆశిష్,
కాశీ నవీన్, బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కిన నాగేంద్ర, దళిత ఐక్యవేదిక నాయకులు ధారా ఏసురత్నం, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబురాజేంద్రప్రసాద్, పసలపూడి బోసు,తాళ్లూరు విజయకుమార్,ఆకుమర్తి చిన్న, పలివెల వీరబాబు, కాపవరపు రాజబాబు, నీలాపు వెంకటేశ్వరరావు, పెందుర్తి సునీల్, కొమ్ము సత్యనారాయణ, కోరుమిల్లి విజయ శేఖర్,మద్దాల కొండలరావు, చాపల చిన్ని రాజు, ముల్లపూడి రాజేంద్రప్రసాద్, రాయి రాంబాబు, మద్దాల యేసు పాదం, డాక్టర్ కండవల్లి లక్ష్మి, మద్ద మణి, కప్పల వెలుగుకుమారి, పెనుముచ్చి సురేష్ కుమార్, యార్లగడ్డ అశోక్ కుమార్, డాక్టర్ రవి, తగరం సురేష్ ,బోయినపల్లి కరుణాకర్, బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధు, యల్లబిల్లి ఝాన్సీ, రాయి అప్పన్న, ఉందుర్తి సుబ్బారావు, విశ్వేశ్వరరావు , పసలపూడి వెంకటరత్నం, ముప్పిడి రాజు, మట్టాడ రమణ, ఎర్రం శెట్టి రాజ్కుమార్, అరుగుల జార్జ్ బాబు బంగారు నాగేశ్వరరావు, కొమ్ము సత్తిబాబు,యార్లగడ్డ జాన్ సుందర్ రాజు, వీర్లంపల్లి ఏసు,బిజెపి నాయకులు మట్టడి రమణ తదితరులు పాల్గొన్నారు.



# మంచు విష్ణు కన్నప్ప.. రెండు రోజుల్లో ఎన్ని కోట్లంటే?

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా థియేటర్లలోకి వచ్చిన కన్నప్ప బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. తొలి రోజే పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్లపరంగా రాణిస్తోంది. మొదటి రోజు రూ. 9.35 కోట్ల నికర వసూళ్లు సాధించింది. అయితే రెండో రోజు రూ.7 కోట్లకు పైగా రాబట్టినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రోజుల్లో కలిపి ఇండియా వ్యాప్తంగా రూ. 16.35 కోట్ల నెట్ కలెక్షన్స్ వసూలు చేసినట్లు సమాచారం. కాగా.. ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటించారు. కాగా.. ఈ సినిమాకు బాలీవుడ్ డైరెక్టర్ ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. రాబోయే రోజుల్లోనూ ఇదే జోరు కొనసాగితే విష్ణు మంచు కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా కన్నప్ప నిలవనుంది. గతంలో మంచు విష్ణు చిత్రాలైన జిన్నా, మోసగాళ్లు సినిమాలకు చాలా తక్కువ వసూళ్లు వచ్చాయి. ఈ సినిమాలో ప్రభాస్ రుద్ర పాత్రలో మెప్పించగా.. మంచు విష్ణు తిన్నడు పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో విష్ణు సరసన ప్రీతి ముకుందన్ కనిపించింది. అంతేకాకుండా మోహన్ బాబు, అర్పిత్ రంకా, బ్రహ్మానందం, బ్రహ్మాజీ, శివ బాలాజీ, కౌశల్ మంద, రాహుల్ మాధవ్, దేవరాజ్, ముఖేష్ రిషి, రఘు బాబు, మధు కీలక పాత్రల్లో నటించారు.




# ఆ సినిమాతో మొదలు కానున్న రవితేజ మల్టీ ప్లెక్స్.. ఫ్యాన్స్ వెయిటింగ్




స్టార్ హీరోలు మల్టీప్లెక్స్ బిజినెస్‌లలోకి వస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఏషియన్ సునీల్ టాలీవుడ్ హీరోలందరితోనూ మల్టీ ప్లెక్సులను కట్టించేస్తున్న నేపథ్యంలో ఆ థియేటర్స్‌కి గిరాకి బాగానే ఉంటుంది. ఏఎంబీతో ఏషియన్ –మహేష్ బాబు ప్రయాణం మొదలైంది. ఆ తరువాత బన్నీతో కలిసి ట్రిబుల్ ఏ థియేటర్ ఏర్పాటు చేశారు. ఈ థియేటర్‌లో కూడా సందడి బాగానే ఉంటుంది. ఇప్పుడు వెంకీమామ, రవితేజలు కూడా మల్టీప్లెక్సులను కట్టించేసుకుంటున్నారు. ఇక విజయ్ దేవరకొండతో ఏవీడీ సినిమాస్ ను నిర్మించగా, దీనికి ప్రేక్షకులు బాగానే వస్తున్నారు. అయితే కొన్ని నెలల క్రితం మాస్ మహారాజా రవితేజతో కలిసి ఏసియన్ సంస్థ ఓ మల్టీప్లెక్స్ నిర్మాణాన్ని ప్రకటించింది. హైదరాబాద్ శివారు వనస్థలిపురం ప్రాంతంలో ఈ మల్టీప్లెక్స్ నిర్మాణం పూర్తి స్థాయిలో ముగింపు దశకు చేరుకుంది. ఇంటీరియర్ వర్క్ ప్రస్తుతం జరుగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, జూలైలో ఈ మల్టీప్లెక్స్‌ను గ్రాండ్‌గా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మల్టీప్లెక్స్ ప్రారంభోత్సవాన్ని పవన్ కళ్యాణ్ నటించిన హరి హర వీరమల్లుతో ప్రారంభించాలని అనుకుంటున్నారట.. ఈ చిత్రం జూలై 24న విడుదల కానుంది. అదే రోజున రవితేజ మల్టీప్లెక్స్ ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావలసి ఉంది. ఈ మల్టీప్లెక్స్‌ను అత్యాధునిక సాంకేతికతతో రూపొందించారు. 57 అడుగుల వెడల్పుతో భారీ స్క్రీన్, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్, సినిమా ప్రేమికులకు కొత్త అనుభూతిని అందించే విధంగా సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.ఇప్పటికే టెస్టింగ్ ప్రక్రియ పలు దఫాలు పూర్తయినట్టు తెలుస్తుంది. త్వరలో టాలీవుడ్ ప్రముఖులతో గ్రాండ్ ఓపెనింగ్ నిర్వహించబోతున్నట్లు టాక్ నడుస్తుంది.. ఇటీవల మల్టీప్లెక్స్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో, రవితేజ మల్టీప్లెక్స్‌కు కూడా ప్రేక్షకాదరణ బాగానే ఉంటుందని భావిస్తున్నారు. మొత్తానికి జూలైలో రవితేజ మల్టీప్లెక్స్ ప్రారంభం, హరి హర వీరమల్లు విడుదల.. ఈ రెండూ కలిపి

# ఓటీటీలో దూసుకెళ్తున్న తెలుగు క్రైమ్ డ్రామా!




చిన్న సినిమాలో ఓటీటీలో దూసుకెళ్తున్నాయి. థియేటర్స్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయినా.. ఓటీటీలో మాత్ర సూపర్ హిట్‌గా నిలుస్తున్నాయి. ఆ లిస్ట్‌లోకి ఇప్పుడు 23 మూవీ కూడా చేరింది. మల్లేశం'ఫేం రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన ఈ క్రైమ్ డ్రామా మే 16న థియేటర్స్‌లో విడుదలై ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఇక రీసెంట్‌గా ఓటీటీలో విడుదలై మంచి వ్యూస్‌తో దూసుకెళ్తోంది. ఒకేసారి మూడు ఓటీటీల్లో ఈ చిత్రం ప్రీమియర్ అవుతోంది. అమెజాన్ ప్రైమ్‌తో పాటు ఆహా, ఈటీవీ విన్‌లోనూ ఈ చిత్రం స్ట్రీమింగ్ అవుతుంది. ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం ట్రెండింగ్‌లో ఉంది. అలాగే ఆహాలో ట్రెండింగ్ అవుతున్న టాప్ 10 సినిమాలో టాప్ 2 ప్లేస్‌లో ఈ చిత్రం ఉంది. 23 విషయానికొస్తే..1991లో చిలకలూరిపేటలో జరిగిన బస్సు దహనం సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. సాగర్(తేజ) ఓ పల్లెటూరిలో ఉంటాడు. లోన్ తీసుకుని ఇడ్లీ బండి పెట్టుకోవాలనేది కోరిక. కానీ అప్పు దొరకదు. పొగాకు కూలీ సుశీల(తన్మయి)ని ప్రేమిస్తుంటాడు. పెళ్లి కాకుండానే ఈమెకు ప్రెగ్నెన్సీ వస్తుంది. ఆమెని పెళ్లి చేసుకుని ప్రశాంతంగా జీవించాలంటే డబ్బు కావాలి. దీంతో తన ఫ్రెండ్ దాస్‌తో కలిసి బస్సు దోపిడీ చేయాలని అనుకుంటాడు. కానీ అది అమలు చేసే క్రమంలో ప్రయాణికులు తిరగబడతారు. అనుకోకుండా నిప్పంటుకుని 23 మంది సజీవ దహనం అయిపోతారు. తర్వాత ఏమైంది? కోర్టు ఏం తీర్పు ఇచ్చిందనేదే మిగతా స్టోరీ.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ జోరు.. అన్నపూర్ణ స్టూడియోస్‌లో పవన్ కళ్యాణ్!

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరియు దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' గబ్బర్‌సింగ్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుంటడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాలకు విరామం ఇచ్చి సినిమాలను కంప్లీట్ చేస్తున్నాడు. ఇప్పటికే హరిహర వీరమల్లు, ఓజీ సినిమా షూటింగ్‌లను కంప్లీట్ చేసిన పవన్ ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్‌ని కూడా పూర్తి చేస్తున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించి ప్రస్తుతం ఒక అప్‌డేట్ వైరలవుతుంది. ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నట్లు సమాచారం. పలు కీలక సన్నివేశాలను పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కిస్తున్నాడు హరీశ్ శంకర్. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన యువ నటి శ్రీలీల సందడి చేయనుంది. ఈ సినిమాకు దర్శకుడు దశరథ్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. సాక్షి వైద్య, అశుతోష్ రానా, గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ ఈ భారీ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.



# ఫ్యాన్స్‌కు రష్మిక అదిరిపోయే ఆఫర్.. ఆ ఒక్కపని చేస్తే లుస్తానంటూ పోస్ట్



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న వరుస విజయాలతో దూసుకుపోతుంది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో తోప్ హీరోయిన్ గా మారిపోయింది. చలో సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన రష్మిక తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత గీతగోవిందం సినిమాతో మరో హిట్ ను తన ఖాతాలో వేసుకుంది. ఇలా వరుసగా సినిమాలు చేస్తున్న క్రమంలోనే సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన నటించే అవకాశం అందుకుంది. మహేష్ అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన సరిలేరు నీకెవ్వరూ సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయ్యింది. ఆతర్వాత పుష్ప సినిమాతో పాన్ ఇండియా స్టార్ అయ్యింది. కేవలం తెలుగులోనే కాదు తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసి సక్సెస్ అయ్యింది రష్మిక.ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయింది ఈ చిన్నది. రీసెంట్ గా కుబేర సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.. ఈ నేషనల్ క్రష్. అయితే రష్మికాకు ఉన్న ఫ్యాన్ బేస్ గురించి ప్రేత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రష్మికకు డై హార్ట్ ఫ్యాన్స్ ఉన్నారు. అయితే రష్మికాను కలవాలని చాలా మంది అభిమానులు ఎదురుచూస్తుంటారు. తాజాగా తనను కలవడానికి ఓ క్రేజీ అఫర్ ఇచ్చింది రష్మిక. నేనే నేరుగా మీ వద్దకు వచ్చి కలుస్తాను అని చెబుతుంది ఈ చిన్నది. తాను వచ్చి కలవాలంటే తాను చెప్పిన పని చేయాలి అని అంటుంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com